


అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
మంగళవారం 30 డిసెంబర్ 2025 పేజీలు : 04

# మృత్యువులోనూ వీడని పేగు బంధం

### గంటల వ్యవధిలో తల్లి బిడ్డ మృతి.. హాస్పిటల్లో బాలింత రోడ్డు ప్రమాదంలో బిడ్డ మృతి






మృతి చెందిన శిశువు, ప్రమాదానికి గురైన అంబులెన్స్ , రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులు



**హిందూపురం డిసెంబర్ 29 ప్రభాతవార్త**

అధిక రక్తపోటుతో బాలింత మృతి చెందగా.. మృతదేహాన్ని తరలిస్తుండగా రోడ్డు ప్రమాదంలో అప్పుడే పుట్టిన శిశువు కూడా దుర్మరణం చెందిన హృదయ విదారకమైన సంఘటన శ్రీ సత్యసాయి జిల్లా లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హిందూపురం మండలం కే బసనపల్లికి చెందిన కలీం భార్య నజమా రెండవ ప్రసవం కోసం హిందూపురంలోని జిల్లా స్థాయి ఆసుపత్రికి వచ్చింది. ఆడ శిశువుకు జన్మనిచ్చిన తర్వాత అధిక రక్తపోటు రావడంతో మెరుగైన వైద్యం కోసం డాక్టర్ల సూచనతో అనంతపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి ఆమె మృతి చెందింది. అనంతపురం నుంచి మృతదేహంతో ఆమె భర్త ఖలీం, బంధువులు, ఆశ వర్కర్ హిందూపురానికి అంబులెన్స్ లో బయలుదేరారు. మార్గమధ్యంలో పెనుగొండ సమీపంలో జాతీయ రహదారిపై వస్తుండగా ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శిశువు అక్కడికక్కడే దుర్మరణం చెందింది. మిగిలిన వారికి తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం సాయంత్రం స్వగ్రామం బసవన్నపల్లిలో అంత్యక్రియలు జరిగాయి. తల్లి మృతదేహంతోపాటు బిడ్డను కూడా కలిపి ఒకే గుంతలో ఖననం చేశారు. జన్మజన్మల అనుబంధం ఏమో కానీ ఈ జన్మలో తల్లి, బిడ్డ కొన్ని గంటల వ్యవధిలోనే చనిపోవడం, ఒకే చోట అంత్యక్రియలు జరగడం సంభవించిందని గ్రామస్తులు కన్నీటి పర్యంతరమయ్యారు.

# అనంతపురం/శ్రీ సత్యసాయి

## తాడిపత్రి ప్రాంతంలో కోట్లాది రూపాయలు

# అక్రమంగా బిల్లులు చేసుకున్నారు

- తాడిపత్రిలో ప్రభాకర్‌రెడ్డి పోలీస్‌ప్రైవేట్ లిమిటెడ్‌గా మార్చేశారు- సీఎం చంద్రబాబుకూడా తాడిపత్రిని ఒక దీవిగా ప్రకటిస్తారేమో - తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ధ్వజం - జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు




జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్నమాజీ ఎ మ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, విలేకర్లతో మాట్లాడుతున్న కేతిరెడ్డి పెద్దారెడ్డి

**అనంతపురం, డిసెంబర్ 29 ప్రభాతవార్త బ్యూరో**

తాడిపత్రి నియోకవర్గంలో ఫోర్జరీ సంతకాలు చేసి కోట్లల్లో డ్రా చేసుకున్నారని, దీనిపై పూర్తి విచారణ జరిపించాలని వైసిపి నేత తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి జిల్లా కలెక్టర్ ఆనంద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. పలువురు ఎంపిటిసిలు, ఎంపిపిలు, సర్పంచులతో కలిసి జిల్లా కలెక్టర్‌ను మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన విలేకర్ల సమావేశంలో కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ.. ఎంపిటిసిలు, ఎంపిపిలు, సర్పంచులప్రమేయం ఎక్కడా లేకుండా ఒక్క తాడిపత్రి మండలంలోనే రూ.కోటి నుంచి రెండు కోట్ల వరకు ఇలా అక్రమంగా బిల్లులు చేసుకున్నారని తాడిపత్రి నియోజకవర్గం మొత్తం మీద రూ.5 కోట్ల వరకు బిల్లులు చేసుకున్నారని పెద్దారెడ్డి ఆరోపించారు. తాడిపత్రిలో ఒక ప్రత్యేక విధానం నడుస్తోందని ప్రభాకర్‌రెడ్డి పోలీస్ ప్రైవేట్ లిమిటెడ్‌గా మార్చి వేశారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దీనిని ఒక ధీవిగా ప్రకటిస్తారన్న అభిప్రాయం ప్రజల్లో ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మెడికల్ కళాశాలల నిర్మాణాలను పిపిపి విధానంలో చేపడితే తాడిపత్రిలో మాత్రం జెసి ప్రభాకర్‌రెడ్డి కూడా అన్ని పిపిపి విధానంలోనే తీసుకొచ్చారని ఆయన ఆరోపించారు. తాడిపత్రి నియోజకవర్గంలో ఎంపిటిసిలకు, సర్పంచులకు తెలియకుండా నిధులు కాజేశారని ఆయన ఆరోపించారు. కొందరు ప్రైవేట్ వ్యక్తులను కూడా నియమించుకుని ఇష్టానుసారం నిధులను డ్రా చేశారని, పూర్తిస్థాయిలో విచారణ జరిపితే అక్రమాలన్ని బయటికి వస్తాయన్నారు. జిల్లా కలెక్టర్ ఈ విషయంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గతంలో తాడిపత్రి నియోజకవర్గానికి సంబంధించి ఎన్నో విషయాలపై ఫిర్యాదు చేసినా జిల్లా అధికారులు అసలు స్పందించడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తాడిపత్రి అనేనియోజకవర్గం జిల్లా పరిధిలో ఉందా, లేదా అని అర్థం కావడం లేదన్నారు. జిల్లా అధికారులకు తాడిపత్రి ప్రాంత అధికారులు భయపడటం లేదని ఫోర్జరీ సంతకాలు చేసి బిల్లులు స్వాహా ఉదంతంపై విచారణ జరిపి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటే భయం ఏర్పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. తమకు ఎలాగో రక్షణ కల్పించడం లేదని, కనీసం సామాన్యులకు రక్షణ కల్పించి అసాంఘీక కార్యక్రమాలను నివారించాలని మాజీ ఎ మ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు, స్థానిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రౌడీ షీటర్ బండి పరుశురామ్‌ను పరిటాల రెచ్చగొడుతూ పావులా వాడుకుంటోంది

- మీరు ఎంత రెచ్చగొట్టినా మేము ఓర్పుగా వెళ్తాం - వచ్చే ఎన్నికల్లో పరిటాల సునీత ఓటమి కోసం కురబలు కంకణం కట్టుకున్నారు
- రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజం - జిల్లా కలెక్టర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే, ఇతర వైసిపి నాయకులు




జిల్లా కలెక్టర్ ఆనంద్‌ను కలిసిన రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, ఇతర వైసిపి నాయకులు , విలేకర్లతో మాట్లాడుతున్నరాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, తదితరులు

**అనంతపురం, డిసెంబర్ 29 ప్రభాతవార్త బ్యూరో**

రాప్తాడు నియోజకవర్గం ఆత్మకూరు మండలం బి.యాలేరులో రౌడీ షీటర్ బండి పరుశురామ్‌ను రెచ్చగొడుతూ పరిటాలకుటుంబం పావుగా వాడుకుంటోందని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, వైసిపి సమన్వయ కర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మండి పడ్డారు. సోమవారం బి.యాలేరు బాధితులు, వైసిపి నాయకులతో కలిసి అనంతపురం జిల్లా కలెక్టర్ ఆనంద్, జిల్లా ఎస్పీ జగదీష్‌లను కలిసి ఫిర్యాదు చేశారు. మజ్జిగ లింగహత్య విషయం జిల్లా పాకిందని రాజకీయంగా ఆశపడి నాగరాజు భూమిని లాక్కుని ఇప్పిస్తామని ఆశ కల్పించి బండి పరుశురామ్ దుర్మార్గంగా ఆరోపణలు చేస్తూ రెచ్చగొడుతున్నారని, ఎంత రెచ్చగొట్టినా మేము ఓర్పుగానే వెళ్తామన్నారు. పరిటాల కుటుంబం అరాచకం తప్ప అభివృద్ధి చేసిందేమీ లేదని, నేను రాజకీయాల్లోకి వచ్చినప్పటినుంచి ప్రజా సేవ కోసం వందల కోట్లు ఖర్చు చేసినట్లు ప్రకాష్‌రెడ్డి వెల్లడించారు. రాప్తాడు నియోజకవర్గంలో పరిటాల సునీత దౌర్జన్యాలు, ఆగడాలు రోజురోజుకు పెరిగి పోతున్నాయన్నారు. ఆత్మకూరు మండలం సిద్దరాంపురంలో కురుబ బాలన్నమీద పరిటాల సునీత బంధువులు దాడి చేశారని, ఆయన ఆరోపించారు. శింగంపల్లిలో శేఖరప్ప మీద పరిటాల సునీత బంధువులు దాడి చేశారని, తోపుదుర్తిలోనూ కురుబ కులస్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆత్మకూరు మండలం బి.యాలేరు గ్రామంలో రౌడీ షీటర్ బండి పరుశురామ్‌ను రెచ్చగొడుతున్నారని, మాపై అసత్య ఆరోపణలు చేస్తుంటే పరిటాల కుటుంబంపైశాచిక ఆనందం పొందుతోందని ఆయన విమర్శించారు. తలుపూరులో మిలటరీ పట్టావిషయంలో పరమేశ్వర్‌రెడ్డికి కురుబ కులానికి చెందిన గోసల వారికి గొడవలు వస్తే వారి మధ్య సయోధ్య కుదిర్చేందుకు మేము ప్రయత్నిస్తే ఎమ్మెల్యే తమ్ముడు బాలాజీ కురుబలను రెచ్చగొట్టి పరమేశ్వరరెడ్డిని సంపించారని ఆయన ఆరోపించారు. ఇప్పుడు అదే భూమికి సంబంధించి అన్నదమ్ముల మధ్య గొడవ సృష్టించి కోర్టులకు తిరిగేలా చేశారని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. బి.యాలేరు గ్రామంలో టిడిపికి చెందిన సీనియర్‌నాయకులు మలరాముడు కుమారుడు ప్రసాద్ స్కూల్ ఎన్నికల్లో పోటీ చేస్తే బండి పరుశురామ్ తండ్రికి పదవి ఇప్పించాలని ప్రసాద్‌పై పోలీసులతో దాడి చేయించారని, అర్ధరాత్రి దాకా పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించి ఎన్నికలు జరుపుతున్నారని ఆయన విమర్శించారు. అదే విధంగా మజ్జిగ లింగమయ్యను పరిటాల సునీత తమ్ముడు ధర్మవరం రమేష్, ఆయనకుమారుడు హత్య చేయించాడని, ఈ ఘటన జిల్లా అంతా పాకిందని అన్యాయంగా కురుబ కులస్తుడిని పొట్టన పెట్టుకున్నారని వచ్చే ఎన్నికల్లో పరిటాల సునీత ఓటమి కోసం కురుబ కులస్తులంతా కంకణం కట్టుకున్నారని ఆయన వెల్లడించారు. దౌర్జాన్యాలతో ఆదిపత్యాలతో అధికారాన్ని చేజిక్కించుకుని ఆదాయాన్ని పెంచుకోవాలని చూస్తున్నారని, ఇప్పటికైనా ఈ విధానానికి పరిటాల కుటుంబం స్వస్థి పలకాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మీరు ఎంత రెచ్చగొట్టినా ఓపికగానేఉంటామని రాప్తాడు నియోజకవర్గం అభివృద్దే మా ధ్యేయమని ఆయన వెల్లడించారు. ఇప్పటికైనా మమ్మల్ని ద్వేశించడానికి సమయం కేటాయించకుండా రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని, 70 శాతం పూర్తి అయిన పిఎబిఆర్ పైప్‌లైన్లుపూర్తి చేసి ఆత్మకూరు, అనంతపుం రూరల్ మండలాలకు తాగునీరు ఇప్పించాలని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యే పరిటాలసునీత కుటుంబానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపినాయకులు అడ్వకేట్‌నాగిరెడ్డి, న్యాయవాది నాగన్న, వైసిపి నాయకులు గోపాల్‌రెడ్డి, రాప్తాడు రామాంజినేయులు, ఆత్మకూరు, రాప్తాడు మండలాల వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# తాడిపత్రిలో మొదలైన న్యూఇయర్ సంబరాలు

### -జె.సి ఫ్యామిలీ ఆధ్వర్యంలో జె.సి పార్కులో వినోదాలు




డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినిలు , కార్యక్రమంలో పాల్గొన్న జె.సి కుటుంబసభ్యులు



పాల్గొన్న కౌన్సిలర్లు, తదితరులు

**తాడిపత్రిఅర్బన్, డిసెంబర్ 29 ప్రభాతవార్త**

తాడిపత్రిలో నూతన సంవత్సరం సంబరాలు ఊపందుకున్నాయి. జె.సి ఫ్యామిలీ ఆధ్వర్యంలో జె.సి పార్కులో నూతన సంవత్సరం వేడుకలను నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో పాటు భారీ వేదికను ఏర్పాటు చేశారు. సోమవారం పట్టణంలోని దాదాపు 35 ప్రైవేటు పాఠశాలల్లో 1 నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థినిలచే ఆధ్యాత్మిక, సినిమా పాటలకు నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమాన్ని చూసేందుకు జె.సి పార్కుకు పట్టణ ప్రజలు భారీగా చేరుకున్నారు. మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి సతీమణి ఉమారెడ్డి, ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి సతీమణి నిఖిలారెడ్డితో పాటు జె.సి కుటుంబ సభ్యులు, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ భూమా నాగరాగిణి, టిడిపి కౌన్సిలర్లు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజలను ఉత్సాహపరిచారు. జె.సి పార్కులో స్వయంసహాయక సంఘాలతో వివిధ స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఫాస్ట్‌ఫుడ్ నిర్వాహకులను అనుమతించి వేడుకల్లో పాల్గొన్న వారికి తినుబండారాలు అందుబాటులో వుండేలా చూశారు. మంగళవారం ఇంటర్, డిగ్రీ విద్యార్థినిలకు డ్యాన్స్ ప్రోగ్రాం నిర్వహించనున్నారు. 31వతేదీన మహిళలకు మాత్రమే అనుమతిస్తూ న్యూఇయర్ సంబరాలు సంతోషంగా జరుపుకునేవిధంగా ఏర్పాట్లు చేశారు.

# భూ వివాదాల పరిష్కారానికి ప్రాధాన్యత

### రెవెన్యూ క్లినిక్"తో వేగవంతమైన పరిష్కారంజిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్





రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్ , జెసి, అర్జీదారులకు భోజనంను వడ్డిస్తున్న దృశ్యం , అర్జిదారునికి సమస్య పరిష్కార ఉత్తర్వులు అందిస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌లు

**శ్రీ సత్య సాయి జిల్లా, డిసెంబరు 29, ప్రభాతవార్త ప్రతినిధి:**

భూవివాదాల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తోందని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు రెవెన్యూ క్లినిక్" కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ సత్యసాయి జిల్లాలో సుల భంగా వేగవంతంగా రెవిన్యూ సేవలు అందించడమే లక్ష్యంగా భూ వివాదాల శాశ్వత పరిష్కారానికి వినూత్న రీతిలో "రెవిన్యూ క్లినిక్స్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా... రెవెన్యూ డివిజన్ వారీగా జిల్లాలోని అన్ని మండలాల ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటుచేశారు. ఈ రెవెన్యూ క్లినిక్స్ కార్యక్రమం ప్రతి నెల నాలుగవ సోమవారం జిల్లా కేంద్రంలో, మిగతా వారాల్లో ఆయా డివిజన్ స్థాయిలో నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి సూచించిన మేరకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఈ రెవెన్యూ క్లినిక్స్ కార్యక్ర మంలో తాసిల్దార్లు, ఆర్డీవో ఒకేచోట ఉండి, రికార్డులన్నింటిని సిద్ధంగా ఉంచుకొని, ఏదైనా గ్రీవెన్స్ వచ్చినప్పుడు అర్జీదారున్ని కూర్చోబెట్టి సావధా నంగా విని డిజైనర్ కార్డులు పరిశీలించాల్సి ఉంటే అక్కడే పరిశీలించి సమ స్య పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. సర్వే చేయాల్సి ఉంటే వాటిని కూడా చేయడం జరుగుతుంది. అడంగల్ లో మార్పులు చేర్పులు, మ్యుటేషన్స్, పట్టాదార్ పేరు మార్పులు, అసైన్మెంట్ పట్టా, ఎప్లైన్, జాయింట్ ఎల్పీఎం సబ్ డివిజన్, 22 ఏ చుక్కల భూముల సమస్యలు, రస్తా, స్మశాన వాటికల సమస్యలు, అలాగే జిల్లాలోని వివిధ మండలాల నుంచి అందిన భూ వివాదాలు, పట్టాదార్ పాస్ పుస్తకాలు, ఆన్‌లైన్ రికార్డుల సవరణ, వారసత్వ నమోదు, ఆక్రమణలపై ఫిర్యాదులు తదితర అంశాలను అత్యంత ప్రాధాన్యతతో పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కారం చూపాలనే దిశగా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. ప్రతి కౌంటర్లో కూడా ఒక తాసిల్దారు, కలెక్టరేట్ నుంచి సూపరింటెండెంట్, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్ ఏర్పాటు చేయడం జరిగింది. ఫిర్యాదు నమోదు నుంచి పరిష్కరించే వరకు తీసుకోవాల్సిన చర్యలపై తాసిల్దార్లకు ఆర్డిఓలకు ప్రతివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు జారీ చేస్తున్నట్లు చెప్పారు. అర్జీదారులకు ఏదైనా తెలియక కోర్టుకు వెళ్లాలన్నా కూడా జిల్లా లీగల్ సెల్ వాళ్ళని సంప్రదించి ఇద్దరు ప్యానెల్ సభ్యులను కూడా కేటాయించారు. వారి ద్వారా సివిల్ కోర్టు కేసులను కూడా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఏదైనా అడంగల్ లో మార్పులు చేర్పు లు చేయాలన్న తాసిల్దార్ స్థాయిలో ఎడిట్ చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. మండల స్థాయి సమస్యలపై ప్రజలు కలెక్టరేట్ కు వస్తే పరిష్కారం అవుతాయి అన్న అపోహను వదలి సమస్యలను స్థానికంగా ఉన్న ఆర్డిఓ, తాసిల్దారు అధికా రులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. మనమిత్ర వాటా ్సప్ గవర్నెన్స్ ద్వారా కూడా మీసేవ ఏపీ సేవల ద్వారా అందించే సర్వీసులు అన్నీ కూడా వాట్సఅప్ ద్వారా ఫోనులోనే పొందవచ్చు అన్నారు. ప్రజల అవగాహన కోసం నేడు ఖి మన మిత్ర వాట్సప్ గవర్నెన్స్ ఖి కౌంటర్ కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం ప్రజల పక్షాన నిలబడి, ప్రతి న్యాయమైన సమస్యకు పరిష్కారం అందిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు అర్జీదారుల సమస్యలను కలెక్టర్ పరిష్కరించగా వారు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా అర్జీదారులకు ప్రత్యేక భోజనం ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమం నందు, కదిరి బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన భాస్కర్ రావు, సత్యనారాయణ, ఆదినారాయణ అను వారు తమ గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 455, విస్తీర్ణం 22.00 ఎకరాలు గల పట్టా భూమిని నిషేధిత జాబితా నుండి తొలగించమని అర్జీ సమర్పించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ తక్షణమే విచారణ నిర్వహించి, సంబంధిత భూమిని నిషేధిత జాబితా నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసి జిల్లా కలెక్టరు , కదిరి శాసన సభ్యులు కందికుంట వెంకటప్రసాద్ , పులివెందుల నియోజకవర్గం తెదేపా అబ్జర్వర్ సామకోటి ఆదినారాయణలు అర్జీదారునికి అందజేశారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించి ఉత్త ర్వులు జారీ చేసినందుకు అర్జీదారుడు హర్షం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం మోర్య భరద్వాజ్, డిఆర్ఓ సూర్య నారాయణ రెడ్డి, ఆర్డీఓలు సువర్ణ, మహేష్, వివిఎస్ శర్మ, ఆనందకుమార్, మండల తాసిల్దారులు, వీఆర్వోలు, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ వద్దు - జీవితం ముద్దు

### -డ్రగ్స్ నివారణపై గోరంట్లలో విద్యార్థులచే ర్యాలీ -రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ జిఎం సురేష్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాలు -హాజరైన రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ జిఎం సురేష్, పెనుకొండ డిఎస్‌పి నరసింగప్ప




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా చైర్మన్ జిఎం సురేష్ , పట్టణంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న చైర్మన్

**గోరంట్ల, డిసెంబర్ 29 ప్రభాతవార్త**

రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక వాసవి మహల్‌లో సోమవారం మత్తు పదార్తాల వ్యతిరేక అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సదస్సులో బాలుర హైస్కూల్ విద్యార్థులు, సిబ్బంది, శ్రీకృష్ణదేవరాయ జూనియర్ కళాశాల, ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాల విద్యార్థులు, ఎస్ఏపిఎస్ జూనియర్ కళాశాలవిద్యార్థులు, ఏఎన్‌కె డిగ్రీ కళాశాల విద్యార్థులు, ఐటిఐ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా బస్టాండ్‌లో మానవహారం ఏర్పాటు చేసి అక్కడి నుండి వాసవి మహల్ వరకు ర్యాలీగా డ్రగ్స్ వద్దు - జీవితంముద్దు, మాదకద్రావ్యాలు, మత్తు వ్యసనాలు, మత్తుతో చేసుకోకండి జీవితాన్ని చిత్తు, మాదకద్రవ్యాల వినియోగం దేశ ప్రగతికి విఘాతం అని నినదిస్తూ అవగాహన కల్పించారు. అనంతరం వాసవి మహల్‌లో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ జిఎం సురేష్ అధ్యక్షత వహించగా డిఎస్‌పి నరసింగప్ప, క్రియేటర్ కృష్ణ, ఈగల్ టీమ్ ఎస్ఐ శ్రీహరి, రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ భక్తవత్సలం, చిలమత్తూరు ఎంఈఓ సల్మాన్‌రాజు, టీచర్ జగదీశ్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిఎం సురేష్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా జీవితాన్ని బంగారుమయం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈగల్‌టీమ్ ఎస్ఐశ్రీహరి మాట్లాడుతూ మాదకద్రవ్యాలు జీవితాన్ని ఏ విధంగా నాశనం చేస్తాయో వివరించారు, డిఎస్‌పి నరసింగప్ప మాట్లాడుతూ విద్యార్థులు చదువు మీద శ్రద్ధ పెట్టి బాగా చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. అలాగే ఎక్కడైనా ఎవరైనా మాదకద్రవ్యాలు వాడుతున్నట్టు తెలిసినా లేక అమ్ముతున్నట్లు తెలిసినా 1972 నెంబర్‌కు తెలియజేయాలని కోరారు. డ్రగ్స్ వినియోగిస్తూపట్టుబడినా అమ్ముతూ పట్టుబడినా చట్టాలు చాలా కఠినంగా ఉంటాయన్నారు. అలాగే బాల్యవివాహాలు నేరమని ఒకవేళ ఆలా ఎవరైనా చేస్తుంటే సమాచారం ఇవ్వాలన్నారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా కానీ లేదా 1972 నెంబర్‌కు గానీ తెలియజేయాలని సూచించారు. మోటివేషనల్ స్పీకర్ క్రియేటర్ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు పైపైమెరుగులు, హంగులుఆర్బాటాలకు గురికాకుండా తల్లిదండ్రులు మీపై ఉంచుకున్న ఆశలను ఆశయాలను నెరవేర్చే విధంగా కష్టపడి కాకుండా ఇష్టపడిచదివి మంచి ఉన్నతస్థానాలను చేరుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం అక్కడికి వచ్చిన వారందరితో మత్తు పదార్థాలు, ఆల్కహాల్, పొగాకు, గంజాయి వంటి వాటి జోలికి వెళ్లమని తల్లిదండ్రులు మాపైఉంచుకున్న ఆశలను నెరవేరుస్తామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అన్నికళాశాలలప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, శివప్పనాయక్, రామాంజనేయులు, అజాద్, అరవింద్, బాలమోహన్, సుధాకర్, బాబు, నరసింహులు, ఆదినారాయణ, పీరే నాయక్, అజీమ్‌బాషా, ఆర్యవైశ్య పెద్దలు బలరాంగుప్తా, నందగోపాల్‌గుప్తా, కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులు శివప్రకాష్, నంజుండ, నరేష్, రెడ్ క్రాస్ సొసైటీ కోఆర్డినేటర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ జడ్పీటీసీ కురుబ గంగమ్మ పార్థివ దేహానికి నివాళి అర్పించిన ఎమ్మెల్యే అమిలినేని



నివాళులర్పించిన ఎమ్మెల్యే దృశ్యం

**బ్రహ్మ సముద్రం డిసెంబర్ 29 ప్రభాతవార్త**

బ్రహ్మసముద్రం మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలు, మాజీ జడ్పీటీసీ నాగిరెడ్డిపల్లి కురుబ గంగమ్మ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. గంగమ్మ మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నాగిరెడ్డిపల్లి గ్రామం చేరుకుని గంగమ్మ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళి అర్పించారు..అనంతరం కుటుంబ సభ్యులు కుమారుడు మాజీ మండల కన్వీనర్ వెంకటేషులు, నాగిరెడ్డిపల్లి సర్పంచ్ సందీప్ ను పరామర్శించి ధైర్యం చెప్పి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## చదువుకు వెళ్ళమంటే... దేవుడి దగ్గరికి వెళ్లి పోయావా కొడకా

### ఉరి వేసుకొని బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

### కన్నీరు మున్నీరుగా విలపించిన విద్యార్థి తల్లిదండ్రులు

### శోక సంద్రంలో గూళ్య గ్రామం



విద్యార్థి చరణ్ (ఫైల్ ఫోటో)

**కంబదూరు, డిసెంబర్ 29, ప్రభాతవార్త**

కంబదూరు మండలం గూళ్యం గ్రామంలో హృదయ విదారక ఘటన చోటు చేసుకుంది. బీటెక్ చదువుతున్న చరణ్ (19) అనే విద్యార్థి సోమవారం ఉదయం వ్యవసాయ క్షేత్రంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం గూళ్యం గ్రామానికి చెందిన కమ్మ గోవిందు, సునీత దంపతుల కుమారుడు చరణ్ అనంతపురం పీవీకేకే కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం జరిగిన సుబ్రమణ్య స్వామి షష్టి సందర్భంగా స్వగ్రామానికి వచ్చాడు. ఇంటిల్లిపాది కలిసి పండుగను సంతోషంగా జరుపుకున్న అనంతరం చదువుల కోసం కళాశాలకు తిరిగి వెళ్ళమని కుమారుడిని తల్లిదండ్రులు మందలించడంతో మనస్థాపానికి గురైన చరణ్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చదువుకు వెళ్ళమంటే దేవుడి దగ్గరికి వెళ్ళిపోయావా కొడకా అంటూ తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవడం పలువురు హృదయాలను కలిసివేసింది. ఈ ఘటనతో మృతుని తల్లిదండ్రులు, బంధుమిత్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు.

## ఎస్సై ను సన్మానించిన టిడిపి నాయకులు



ఎస్సై ను సన్మానిస్తున్న దృశ్యం

**గుమ్మఘట్ట డిసెంబర్ 29 ప్రభాతవార్త**

మండలంలోని నూతనంగా బాధ్యతలు చేపట్టిన సబ్ ఇన్స్పెక్టర్ చిన్న రాయుడు ను సోమవారం టిడిపి నాయకులు దురుగేష్,హనుమన్న, సన్నన్న, పాపారాయుడు కలిసి ఎస్సై చిన్న రాయుడు ను శాలువా కప్పి సన్మానించారు కుందుర్పి పిఎస్ఐగా ఉన్న జి చిన్న రాయుడు గుమ్మఘట్ట మండలానికి నూతనంగా బాధ్యతలు స్వీకరించడంతో శుభాకాంక్షలు తెలియజేశారు.

## కనేకల్‌లో భారీ చోరీ కేసు చేదించిన పోలీసులు-బంగారం, వెండి స్వాధీనం

**కనేకల్లు డిసెంబర్ 29 ప్రభాతవార్త**



మాట్లాడుతున్న సిఐ వెంకటరమణ

కనేకల్ మండలంలో ఇటీవల జరిగిన భారీ చోరీ కేసును కనేకల్ పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ఈ కేసులో నిందితుడు ఆఫ్ఘాన్ రజాక్ వలీని అరెస్ట్ చేసి, దొంగలించిన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు రాయదుర్గం రూరల్ సీఐ కె. వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం రాయదుర్గం రూరల్ పోలీస్ స్టేషన్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయదుర్గ నియోజకవర్గం సీఐ వెంకటరమణ ఆయన మాట్లాడుతూ, కనేకల్ టౌన్‌కు చెందిన పెద్ద దేవర తభుసము భర్త లాతీఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని చెప్పారు. దర్యాప్తులో భాగంగా నిందితుడు ఇంటి వెనుక వైపు నుంచి ప్రవేశించి, బీరువాను బద్దలుకొట్టి అందులో ఉంచిన 10 తులాల బంగారు ఆభరణాలు, ఒక కేజీ వెండి ఆభరణాలు (మొత్తం విలువ సుమారు రూ.12 లక్షలు) దొంగలించినట్లు గుర్తించినట్లు తెలిపారు. కళ్యాణదుర్గం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి పి. రవిబాబు ఆదేశాల మేరకు, రాయదుర్గం రూరల్ సీఐ కె. వెంకటరమణ, కనేకల్ ఇన్‌చార్జ్ (బొమ్మనహల్) ఎస్సై బి. నబీరసూల్, కనేకల్ పీఎస్సై వి.నారాయణరెడ్డి వారి సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, అనంతపురం నుంచి క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి నేరస్థలాన్ని సూక్ష్మంగా పరిశీలించి సేకరించినట్లు వివరించారు.

## వాల్మీకి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చైర్ పర్సన్ గౌతమి సోమశేఖర్ ఘన సన్మానం

**కళ్యాణదుర్గం రూరల్ డిసెంబర్ 29 ప్రభాతవార్త**

వాల్మీకి ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ తలారి గౌతమి సోమశేఖర్ ను సోమవారం ఘనంగా సన్మానించారు. ఇటీవలే కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో జరిగిన ఎన్నికలలో కళ్యాణదుర్గం మున్సిపల్ చైర్ పర్సన్ గా ఎన్నికైన వాల్మీకి ముద్దుబిడ్డ, కళ్యాణదుర్గం వాల్మీకుల ఆదర్శ నాయకులు తలారి గౌతమి సోమశేఖర్ ను కళ్యాణదుర్గం నియోజకవర్గ వాల్మీకి ఉద్యోగ సంఘం నాయకులు ఆమె స్వ గృహంలో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియచేశారు వాల్మీకులకు ఇంతటి గొప్ప అవకాశం ఇచ్చినందుకు స్థానిక శాసనసభ్యులు అమిలినేని సురేంద్ర బాబు కు వాల్మీకి ఉద్యోగ సంఘం తరఫున ధన్యవాదాలు తెలియచేసారు.వాల్మీకులు రాజకీయంగా ఎదగాలని,ఉన్నత స్థాయిలో నిలవాలని, ఉన్నత పదవులు పొందాలని వారికి మీరు ప్రేరణగా నిలవాలని నూతన మున్సిపల్ చైర్ పర్సన్ కు తెలియచేశారు.ఈ కార్యక్రమంలో వాల్మీకి ఉపాధ్యాయ ఉద్యోగ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గౌతమి సోమశేఖర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

## హత్య కేసులో 8 మంది అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

**హిందూపురం డిసెంబర్ 29 ప్రభాతవార్త**

రెండు రోజుల క్రితం హిందూపురం పట్టణంలోని సాయి కిరణ్ బెడ్డింగ్ సెంటర్లో జరిగిన మహిపాల్ హ త్య కేసులో 8 మంది నిందితులను వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు సోమవారం ఉదయం స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ రాజగోపాల్ నాయుడు మీడియాకు వివరాలు వెల్లడించారు. ముద్దాయిలు కర్ణాటక రాష్ట్రం గౌరీబిదనూరు చెందిన సురేష్ అలియాస్ మంజునాథ్(22), పరిగి మండలం పెద్దిరెడ్డిపల్లి వాసి దాసరి బాలాజీ(28), పెనుకొండ నిఖార పోర్టులో వున్న బెంగళూరుకు చెందిన వాసు కుమార(42) హిందూపురం పట్టణంలో బాపూజీ నగర్ చెందిన బాలకృష్ణ(42), సాకే మనోహర్(37), హస్నాబాద్ శివకుమార్, సోమందేపల్లి మాగే చెరువు గ్రామస్తుడు టి.ప్రభాకర(35) సుద్ద కుంటపల్లి రవీంద్ర(30) అరెస్టు చేసినట్లు చెప్పారు. 22వ తేది రాత్రి వాసు కుమార్ సాయి కిరణ్ బెడ్డింగ్ సెంటర్ నందు పడుకోవడానికి వచ్చినాడు, అయితే 23వ తేది ఉదయం అతని ఫోను ఎవరో దొంగలించినారు. 24వ తేదిన వాసు కుమార్ ఫోనును అతని పక్క మంచం పై పడుకొన్న మృతుడు మహిపాల్ దొంగలించినాడని అనుమానంతో తన మిత్రులతో కలిసి దాడి చేశాడు. బెడ్డింగ్ సెంటర్లో చిత్రహింసలకు గురి చేయడంతో తనను చంపేస్తారేమో నన్న భయంతో వాల్మీకి సర్కిల్లో ఉన్న ఒకరికి మీ ఫోన్ ఇచ్చానని మహిపాల్ చెప్పాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న వాసు, ఇతర ముద్దాయిలు వాల్మీకి సర్కిల్ వెళ్లి ఫోన్ కోసం విచారించగా, తాను ఎవరికి ఇవ్వలేదని తాను ఫోను దొంగలించలేదని భయంతోనే అలా చెప్పానని మహిపాల్ చెప్పాడు. ఇక్కడే ఉన్న ఓ మద్యం దుకాణంలో మళ్ళీ సేవించి తిరిగి వారంతా బెడ్డింగ్ సెంటర్ కు వచ్చారు. మరోసారి మహిపాల్ ను కట్టెతో, తలతో కొట్టడంతో రక్త గాయాలకు గురై బెడ్ పైనే చనిపోయాడు. బెడ్డింగ్ సెంటర్ నిర్వాహకుడు ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు హత్యకు పాల్పడిన వారందరినీ అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. సమావేశంలో ఎస్సై శ్రీధర్ తో పాటు సిఐలు కరీం, జనార్దన్ పాల్గొన్నారు.

## చోరీ కేసును చేదించిన పోలీసులు

### 48 గంటల్లోనే నేను చేతులు పట్టుకున్న పోలీసలు

**రాయదుర్గం డిసెంబర్ 29 ప్రభాతవార్త**

రాయదుర్గం నియోజకవర్గం కనేకల్ మండల కేంద్రంలో జరిగిన చోరీ కేసును ఎట్టకేలకు పోలీసులు 45 8 గంటల్లోనే చేదించారు 12 లక్షల విలువచేసే సొత్తు స్వాధీనం చేసుకున్నారు రాయదుర్గం నియోజకవర్గం రూరల్ సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు కనేకల్ పట్టణం పెద్ద దేవరా తుబుసం లతీఫ్ అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో ఈనెల 22న తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసుకొని బంధువులు చనిపోగ కార్యానికి వజ్రకరూరు గ్రామానికి వెళ్లారు అక్కడినుండి హైదరాబాద్ పని నిమిత్తం వెళ్లారు తిరిగి ఈనెల 27 ఉదయం 9 గంటలకు కనేకల్ లోని తన ఇంటికి వచ్చి చూడగా ఇంటిలోని సామాన్లన్నీ చల్లచదురుగాపడి ఉండడంతో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి వెనకవైపు భాగం నుండి డోరు పగలగొట్టి ఇంటిలోకి ప్రవేశించే బీరువాలో ఉన్న పది తులాల బంగారు ఆభరణాలు మరియు ఒక కేజీ వెండి మొత్తం 12 లక్షలు విలువ చేసి బంగారు వెండి చోరీ జరిగినట్లు గుర్తించి వెంటనే కనేకల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు కనేకల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించామని రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ తెలిపారు. వివరాల మేరకు... మండల కేంద్రంలో 22వ తేదీన జరిగిన చోరీ సంఘటన విషయంపై సంబంధిత కళ్యాణ్ దుర్గం డిఎస్పి రవిబాబు ఆదేశాల మేరకు ఈనెల 29 న రాయదుర్గం రూరల్ సీఐ కు రాబడిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి ఉదయం కనేకల్ క్రాస్ వద్ద బళ్లారి రోడ్డు సమీపంలో నిందితుడు ఆఫ్ఘాని రజాక్ ను నిందితుడు అరెస్టు చేసి చోరీ విషయంపై ఒప్పుకున్నట్లు వారు సూచించారు..నిందితుడు మద్యం క్రికెట్ బెట్టింగ్ రిజర్వేషన్లకు అలవాటు పడి అప్పులు చేసి అప్పులు తీర్చడానికి తన వ్యసనాల కోసం తాళం వేసి ఉన్న ఇళ్లను ఇరవేసి దొంగతనాలకు పాల్పడేవాడని విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు 12 2025న రాత్రి సమయంలో కనేకల్ టౌన్ లో ప్రభుత్వ ఆసుపత్రికి దగ్గరలో ఉన్న తాళం వేసిన ఇంటికి వెనుకవైపున ద్వారా నిందితుడు ఇందులోకి ప్రవేశించి ఇంటిలో బీరువాలో దాచిన విలువైన బంగారు మరియు వెండి ఆభరణాలు అపహరించి వాటిని తన తమ్ముడు ఇంటిలో పెట్టి బళ్లారి కి తీసుకొని పోయి అమ్ముకోవడానికి వెళుచుండగా పోలీసులు అతి చాకచక్యంగా తమదైన శైలిలో నిందితుడిని గుర్తించి రౌండప్ చేసి అరెస్టు చేశారని తెలిపారు.. నిందితుడు దొంగలించిన పది తులాల బంగారం ఒక కేజీ వెండి ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేస్తామని పేర్కొన్నరు

## యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**కంబదూరు, డిసెంబర్ 29, ప్రభాతవార్త**

కంబదూరులోని మండల విద్యాధికారి కార్యాలయం నందు సోమవారం యుటిఎఫ్ 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను ఎంఈఓ ఉమాపతి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ ఎప్పుడు ముందంజలో ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చింత చెట్టు పై నుంచి కింద పడ్డ వ్యక్తి మృతి



మృతి చెందిన బోయ రాజశేఖర్

**ఉరవకొండ, డిసెంబరు 29 ప్రభాతవార్త**

ఉరవకొండ మండల పరిధిలోని కోనాపురం గ్రామంలో ఆదివారం చింతచెట్టు పైనుంచి కిందపడి తీవ్రంగా గాయపడిన బోయ రాజశేఖర్ (32) అనే వ్యక్తి అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని యుపిఎస్ సీఐ బి. మహానంది సోమవారం తెలిపారు. చింతకాయలు పీకడానికి చెట్టుపై ఎక్కిన రాజశేఖర్ ప్రమాదవశాత్తు కింద పడగా ఉరవకొండ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్సకై జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడన్నారు. మృతుని భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహానికి సోమవారం శవ పరీక్షల అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించడం జరిగిందన్నారు. అతనికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

## నేడు ముక్కోటి ఏకాదశి ముమ్మరంగా ఏర్పాట్లు

**రాయదుర్గం డిసెంబర్ 29 ప్రభాతవార్త**

రాయదుర్గం పట్టణం కోటలో వెలిసిన ప్రసిద్ధి చెందిన పురాతన ఆలయం శ్రీ వెంకటరమణ స్వామి దేవాలయంలో మంగళవారం ముక్కోటి ఏకాదశి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గాజుల వెంకటేశులు గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి నరసింహారెడ్డి పేర్కొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీ స్వామివారికి సుప్రభాత సేవ పంచామృతాభిషేకం పుష్పాలంకరణ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఈ సందర్భంగా స్వామివారి దర్శనానికి హాజరవుతున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు ఈ ఏకాదశి సందర్భంగా శ్రీ సోమవారం దర్శించుకోవడానికి స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్పు కాల్వ శ్రీనివాసులు హాజరుకానున్నట్లు వారు పేర్కొన్నారు.

## మండల ప్రజలు ప్రశాంతతకు మారుపేరు.. డి.ఎస్.పి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్పి పి.రవిబాబు

**డి.హిరెహాళ్ డిసెంబరు 29 ప్రభాతవార్త**

మండల ప్రజలు ప్రశాంతతకు మారుపేరని మరింత ప్రశాంతమైన వాతావరణం లో జీవనం సాగిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నానని డీఎస్పీ పి రవిబాబు తెలిపారు. సోమవారం డి.హిరెహాళ్ మండలం పులకుర్తి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు దర్యాప్తులో భాగంగా విచ్చేసిన ఆయన మండల కేంద్రంలోని నూతన పోలీస్ స్టేషన్ భవనంను సందర్శించారు. పోలీస్ స్టేషన్ ను పరిశీలించిన అనంతరం ఆయన నూతన పోలీస్ స్టేషన్ భవనంలో సి.ఐ.వెంకటరమణ, ఎస్సై గురుప్రసాద్ రెడ్డి తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ నేపథంలో ఆయన ముందుగా మండల ప్రజలకు నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతు డి.హిరెహాళ్ మండలం చాలా ప్రశాంతమైన మండలం ప్రజలందరికీ వచ్చే సంవత్సరం కూడా మంచి శుభాలు కలగాలని అలాగే ప్రతి ఒక్కరు తగిన జాగ్రత్తలు పాటిస్తూ అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఆయన కోరారు. ఎలాంటి క్రిమినల్ కేసుల్లో ఇరుకోకుండా, రోడ్ యాక్సిడెంట్లు, గ్యాంబ్లింగ్, మట్కా, గంజాయి లాంటి వాటికి ప్రజలు చాలా దూరంగా ఉండాలని డి.ఎస్.పి కోరారు. అతివేగం, అజాగ్రత్త వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని రక్షణ కోసం విధిగా హెల్మెట్ ధరించాలని ఆయన చెప్పారు. హెల్మెట్ ధరించకపోవడం డ్రైవింగ్ సమయంలో చరవాణి ఉపయోగించడం అనర్థాలకు దారితీ తీసుకోందని డ్రైవింగ్ సమయంలో ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని లేదంటే ప్రమాదాలు సంభవిస్తాయని ఆయన హెచ్చరించారు. వాహనాలకు లైసెన్సు, సరైన రికార్డ్స్ లేకపోవడం నేరమని మీ ప్రాణాలు మీ కుటుంబానికి చాలా విలువైనవని దయచేసి అందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు. పోలీసులు తరపునుండి పోలీసు సిబ్బంది నుండి ఏ సాయం కావాలన్నా మీకు అందుబాటులో ఉంటూ మీకు సహాయ సహకారాలు అందించడానికి అన్నివేళలా సిద్ధంగా ఉంటామని ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. తమ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించడం వల్ల క్రైమ్ రేట్ బాగా తగ్గిందని తమ సిబ్బంది విధి నిర్వహణలో ఎలాంటి జాప్యం చేయకుండ పై అధికారుల ఆదేశాలను పాటిస్ పాలనాపరమైన చర్యలు చేపట్టుతుండడంతో నేరాలు అదుపు సాధ్యమైందని ఆయన చెప్పారు. ముఖ్యంగా డి హీరేహాల్ పోలీస్ స్టేషన్లో గత సంవత్సరం 226 క్రిమినల్ కేసులు నమోదు కాగా ఈ సంవత్సరం 147 కేసులు ఉన్నాయని అందులో ప్రస్తుతం 40 కేసులు మాత్రమే పరిష్కరించాల్సి ఉందన్నారు. ఈ సంవత్సరం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు రెండు కేసులు నమోదు అయ్యాయని, గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరంకు కేసులు తగ్గాయని ఆయన పేర్కొన్నారు.

## చెరువులను మింగేస్తున్న కూటమి నాయకులు..

### అక్రమంగా మట్టి తరలిస్తున్న కూటమి నాయకులు..

### పట్టించుకోని అధికారులు..



తాసిల్దార్ కార్యాలయం నిరసన తెలియజేస్తున్న మాజీమంత్రి, వైసిపి నాయకులు

**సోమందేపల్లి డిసెంబర్ 29 ప్రభాతవార్త**

మండలంలోన కొత్తపల్లి గ్రామ శివారులో రాత్రింబవళ్లు అక్రమంగా మట్టి తరలిస్తూ కోట్ల రూపాయల ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారన్న ఉషశ్రీ చరణ్ పేర్కొన్నారు సోమవారం మాగేచెరువు పంచాయితీ కొత్తపల్లి గ్రామస్తులతో కలిసి అక్రమంగా తవ్వకాలు చేపట్టిన కొత్తపల్లి చెరువును మొత్తం పర్యవేక్షించి, చెరువులో అక్రమ తవ్వకాలు చేపట్టిన టిడిపి గుండాలను వెంటనే అరెస్టు చేయాలని చెరువులో ధర్నా నిర్వహించి లీలీవీ ఆఫీస్ వరకు ర్యాలీగా వెళ్లి లీలీవీ కి వినతి పత్రం అందజేసి, కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని లూటీ చేస్తున్న కూటమి నాయకులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కోరిన మాజీ మంత్రి, శ్రీ సత్యసాయి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ నియోజకవర్గం లో తన సంపద సృష్టిలో భాగంగా ఎక్కడ చూసినా ఏ చెరువు చూసిన, ఏ కొండ చూసిన, ఏ కుంట చూసిన మట్టిని అక్రమంగా తరలించడమే సవితమ్మ పనిగా పెట్టుకుంది కొత్తపల్లి గ్రామంలో అయితే స్మశాన వాటికకు వెళ్లే దారిని కూడా తన సంపద కోసం చెరువులో ఉన్న దారిని కూడా అక్రమంగా తవ్వేశారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన వారు స్పందించకపోవడం చాలా బాధాకరమన్నారు మా చెరువులో అక్రమ మట్టి ఎందుకు తోలుతున్నారని గ్రామస్తులు వెళితే గ్రామస్తుల పైన అక్రమ కేసులు పెట్టి, చిత్రహింసలకు గురిచేస్తున్నారన్నారు ఇది ఇలానే కొనసాగితే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున కలెక్టర్ రేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గజేంద్ర, టౌన్ కన్వీనర్ శ్రీనివాసులు ,ఉపాధ్యక్షులు మంజునాథ్ ,ఉప సర్పంచ్ వేణుగోపాల్, మాజీ కన్వీనర్ నారాయణరెడ్డి, వెంకట్ నారాయణ రెడ్డి, కుమార్ ,ఉపేంద్ర యాదవ్, లక్ష్మీ నర్సప్ప ,మాజీ డీలర్ బాబు,మాజీ డీలర్ రవీందర్ రెడ్డి,మురళి యాదవ్,కిష్టప్ప యాదవ్, గోవింద్ రెడ్డి తదితరులు పెద్ద ఎత్తున ఉన్నారు..

## యుటిఎఫ్‌లో...గోరంట్ల టీచర్లకు ఉన్నత పదవులు

### -జిల్లా కార్యదర్శిగా మురళి, ఆడిట్ కమిటీ సభ్యులుగా కిష్టప్ప నియామకం

**గోరంట్ల, డిసెంబర్ 29 ప్రభాతవార్త**



జిల్లా కార్యదర్శిగా ఎంపికైన మురళి



ఆడిట్ కమిటీ సభ్యునిగా ఎన్నికైన కిష్టప్ప

యుటిఎఫ్ జిల్లా 4వ కౌన్సిల్ సమావేశం సోమవారం జిల్లాలోని మడకశిరలో నిర్వహించగా అక్కడ జరిగిన జిల్లా కమిటీ ఎంపిక కార్యక్రమాల్లో గోరంట్ల మండలానికి ప్రాముఖ్యత కలిగిన రెండు ప్రధాన పదవులు దక్కినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా గోరంట్ల మండలానికి చెందిన ఉపాధ్యాయులు మురళికి జిల్లా కార్యదర్శిగా అలాగే జిల్లా ఆడిట్ కమిటీ సభ్యునిగా కిష్టప్పకు చాన్స్ లభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాపై నమ్మకంతో మాకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉపాధ్యాయుల సమస్యల కోసం రాజీలేని పోరాటం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల గౌరవాధ్యక్షులు కృష్ణ ప్రసాద్, మండల అధ్యక్షులు చాంద్‌బాషా, సెక్రటరీ నగేష్, ట్రెజరర్ రామకృష్ణ, ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి, రామాంజనేయులు, శ్రీధర్‌రావు, రామచంద్రప్ప, సూర్యనారాయణరెడ్డి, ఆంజనేయులు, సురేష్, నరసింహులు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## షరతులు లేకుండా కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ సాయం అందించాలి

### -ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగారెడ్డి, బాలరంగయ్య




సీపీఎం పార్టీ కార్యాలయం జరిగిన ఏపీ కౌలు రైతు సంఘం సమావేశం దృశ్యం

**ఉరవకొండ, డిసెంబరు 29 ప్రభాతవార్త**

ఎటువంటి షరతులు లేకుండా కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ సాయం అందించాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగారెడ్డి, బాలరంగయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో సోమవారం కౌలు రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌలు రైతులందరికీ బ్యాంకుల ద్వారా పంట రుణాలు అందించాలన్నారు. సీసీఆర్ కార్డులున్న రైతుల పేరుమీద ఈ-క్రాప్ నమోదుచేసి వారి వద్దనుండి పంటను కొనగోలుచేసి బ్యాంకు ఖాతాల్లో సొమ్మును జమ చేయాలన్నారు. ప్రభుత్వం కందులను క్వింటాల్ 10వేల రూపాయలతో కొనగోలు చేయాలని కోరారు. లత్తవరం, పెద్దముష్టూరు, రేణుమాకులపల్లి గ్రామాల్లోని దేవాలయ భూములు సాగు చేసుకొంటున్న కౌలు రైతుల సమస్యలను పరిష్కారాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని కొనసాగించి 200 పని దినాలు కల్పించాలని, రోజు కూలీ 600 రూపాయలు అందించి పాత పద్ధతిలోనే పనులు పెట్టాలని డిమాండ్ చేశారు. విత్తన చట్టం, విద్యుత్ సవరణ బిల్లు 2025 సవరించరాదన్నారు. అనకాపల్లి జిల్లా రైతు సంఘం కార్యదర్శి అప్పలరాజును ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్టణంలో జరిగే సీఐటీయూ అఖిలభారత 18వ మహాసభలకు నియోజకవర్గం నుండి కౌలు రైతులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంఅనంతరం తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు పెద్దముష్టూరు వెంకటేశులు, రైతు సంఘం నాయకులు శ్రీనివాసులు, సుంకన్న, శంకరప్ప, వెంకటరమణ, ధనుంజయ, సుధాకర్, సురేష్, రామాంజినేయులు, తిప్పమ్మ, నాగవేణి, ఎర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



ఈఈ రాజశేఖర్

**గుత్తి, డిసెంబర్ 29 ప్రభాతవార్త**

గుత్తి ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో మరమ్మతులు కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఇన్‌చార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజశేఖర్ తెలిపారు. స్థానిక 220 కెవి రిసీవింగ్ స్టేషన్‌లో పాత పీటీలు మరియు ఎల్ఏఎస్‌లను కొత్తవాటితో మార్చే పనులను చేపడుతున్నామని ఆయన తెలిపారు. కావునా మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## తైక్వాండో పోటీలలో గుత్తి విద్యార్థికి బంగారు పతకం



విద్యార్థికి బంగారు పతకం అందజేస్తున్న దృశ్యం

**గుత్తి, డిసెంబర్ 29 ప్రభాతవార్త**

రాష్ట్రస్థాయిలో జరిగిన తైక్వాండో పోటీలలో గుత్తికి చెందిన విద్యార్థి అభిరామరాజు బంగారు పతకం సాధించారు. సాయి స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఇతను ఇటీవల తెనాలిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనపరిచి బంగారు పతకాన్ని సాధించాడు. అతనితో పాటు ఆరుగురు పతకాలను పొందారు. వీరిని పలువురు అభినందించారు

## టిడిపి అధికార ప్రతినిధికి ఘన సన్మానం

**లేపాక్షి, డిసెంబర్ 29 ప్రభాతవార్త**



ఆనంద్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మండల కేంద్రమైన లేపాక్షిలో సీనియర్ టిడిపి నేత, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి ఆనంద్‌కుమార్‌ను లేపాక్షి జర్నలిస్టులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధారణ కార్యకర్త నుండి లేపాక్షి ఎంపిపిగా జిల్లా అధికార ప్రతినిధిగా అంచలంచలుగా ఎదిగిన ఆనంద్‌కుమార్ మరిన్ని ఉన్నత పదవులను చేరుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో లేపాక్షిమండల జర్నలిస్టులు, పాల్గొన్నారు.

## పాలసముద్రం హైవేలో ప్రమాదం.... తెలంగాణ మహిళ అక్కడికక్కడే మృతి

### -సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ రాము

**గోరంట్ల, డిసెంబర్ 29 ప్రభాతవార్త**



అక్కడికక్కడే మృతి చెందిన మహిళ



తీవ్రంగా గాయపడిన మృతురాలి భర్త

ఉద్యోగరీత్యా బెంగళూరులో స్థిరపడ్డ కుటుంబం సొంత పనులు ముగించుకొని హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళుతుండగా మార్గమధ్యంలోని గోరంట్ల మండలం పాలసముద్రం జాతీయ రహదారిలో ప్రమాదవశాత్తు వారు ప్రయాణిస్తున్న కారు రోడ్డు పక్కన డివైడర్‌కు ఢీకొట్టడంతో కారులోని మహిళ అక్కడికక్కడే మృతిచెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం గోరంట్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో హైదరాబాద్ ప్రాంతానికి చెందిన అనిలా (35) అక్కడికక్కడే మృతిచెందగా ఆమె భర్త వెంకటరాజులు మరియు వారి పిల్లలు శ్రావ్యతో పాటు పది నెలల చిన్నారి శివాన్స్‌లు తీవ్రంగా గాయపడ్డారు. బాధిత కుటుంబం గత కొంతకాలంగా బెంగళూరులో ఉద్యోగరీత్యా స్థిరపడిన నేపథ్యంలో ఇటీవల తమ సొంత ప్రాంతమైన హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి బెంగళూరు వెళ్ళేందుకు కుటుంబ సభ్యులతో కలసి కారులో ప్రయాణిస్తుండగా జాతీయ రహదారి 44లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలో ఆ కారు ప్రమాదానికి గురికావడంతో సంఘటన చోటుచేసుకుంది. గాయపడ్డ క్షతగాత్రులను 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న గోరంట్ల ఎస్ఐ రామచంద్ర తన సిబ్బందితో అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టి వివరాలను నమోదు చేసుకున్నారు.

# జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన పూల నాగరాజు

## నూతన కార్యాలయం ఏర్పాటు దిశగా తొలి సంతకం చేసిన అధ్యక్షుడు





కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించి అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి , జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తున్న పూల నాగరాజు, ఎమ్మెల్యే దగ్గుపాటి ఇతర టిడిపి నాయకులు

అనంతపురం డిసెంబర్ 29 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా పూల నాగరాజు బాధ్యతలు స్వీకరించారు. సోమవారం ఉదయం ఆయన ప్రధాన కార్యదర్శి, ఇతర జిల్లా కమిటీ సభ్యులతో కలిసి కార్యాలయానికి వచ్చారు. ముందుగా కార్యాలయంలో పూల నాగరాజు కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పార్టీ వ్యవస్థాపన అధ్యక్షులు ఎన్టీ రామారావు విగ్రహానికి ఎమ్మెల్యే దగ్గుపాటి, అధ్యక్ష ప్రధాన, కార్యదర్శులు పూల నాగరాజు, శ్రీధర్ చౌదరి, టిడిపి రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ బివి వెంకటరాముడు, టిడిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అధ్యక్షుని స్థానంలో కూర్చుని బాధ్యతలు స్వీకరించారు. మాజీ అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ ఆయనకు బాధ్యతలు అప్పజెప్పాడు. అనంతరం ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి కూడా ప్రత్యేక పూజలు నిర్వహించి బాధ్యతలు చేపట్టాడు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులకు ఎమ్మెల్యే దగ్గుపాటి శుభాకాంక్షలు తెలిపారు. అధ్యక్షుడు పూల నాగరాజు తొలి సంతకం నూతన కార్యాలయం ఏర్పాటు కోసం చేశారు. జిల్లా కేంద్రంలో నూతన కార్యాలయం నిర్మించే ప్రతిపాదన ఉన్న నేపథ్యంలో స్థల సేకరణ, ఇతర వాటి కోసం కలెక్టర్ ను కలిసేందుకు తొలి సంతకంపై ఆ పత్రం చేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు అధ్యక్ష, కారదర్శులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం అనంతరం వారు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సోదరుడు, టీడీపీ సీనియర్ నాయకుడు పయ్యావుల శ్రీనివాసులును కలిశారు. అలాగే కమ్మభవన్ లో పార్టీ సీనియర్ నాయకులు సరిపుటి సూర్యనారాయణ, నాగన్న ఇతర పెద్దలతో మర్యాదపూర్వకంగా భేటి అయ్యారు. వారు నూతన అధ్యక్షుడిని ఘనంగా సత్కరించారు. పార్టీ కోసం మా సహకారం ఎప్పటికీ ఉంటుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణకుమార్, టిడిపి అధికార ప్రతినిధి భూలక్ష్మీ, జిల్లా మీడియా కోఆర్డినేటర్ దబ్బర కుమార స్వామి నాయుడు, సింగమల మార్కెట్ యార్డ్ చైర్మన్ దండు శ్రీనివాసులు, డైరెక్టర్లు పి ఎల్ ఎన్ మూర్తి, పోతుల లక్ష్మీనరసింహులు, టిడిపి నాయకులు కొండవీటి సుధాకర్ నాయుడు, జిరాయతి గౌస్ మోద్దిన్, సరిపుటి రమణ, సుధాకర్ యాదవ్, నెట్టెం బాలకృష్ణ, కాయగూరల శ్రీధర్, తొండపునాటి రమేష్, రాయల్ మధు, చేపల హరి, మణిరవి వాల్మీకి, కేశవ నాయుడు, వన్నూరప్ప, మణికంఠ బాబు, చెక్క నాగేంద్ర, మున్వర్, గోళ్ళ సుధాకర్ నాయుడు, సంగా తేజస్విని, కురుబ నారాయణస్వామి, ఓంకార్ రెడ్డి, కృష్ణం రఘు, వడ్డే భవాని, లక్ష్మీ నాయుడమ్మ, డిష్ ప్రకాశ్, ఇస్మాయిల్, తాటి మధు, రజాక్, రామకృష్ణ, జాఫర్, ముస్తాక్, బెస్త వెంకటేష్, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, రమాదేవి, సురేష్, సికిందర్, దాడి మల్లికార్జున, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి స్థలంకేటాయించండి

శింగనమల, డిసెంబర్ 29 ప్రభాతవార్త



తహశీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి స్థలం మంజూరు చేయాల నిశింగనమల అయ్యప్పస్వామి భక్త మండలి సభ్యులు సోమ వారం తహశీల్దారు శేషారెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. గత ఐదు సంవత్సరాల నుంచి అయ్యప్ప ఉత్సవాలు, పూజలు, మండల దీక్షలు ఘనంగా జరుగుతున్నాయని, అయితే ఇంత వరకు మా గ్రామంలో అయ్యప్పస్వామి దేవాలయం లేదు. కావున ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం తరుపున స్థలం మంజూరు చేయాలని వారు కోరారు. శింగనమల అయ్యప్ప భక్త మండలి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## యూటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

శింగనమల, డిసెంబర్ 29 ప్రభాతవార్త



యూటిఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోని ఎమ్మార్సిలో సోమవారం యూటిఎఫ్ 2026 సంవత్సరం క్యాలెండర్, డైరీని ఎంఈఓ నరసింహరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయ ఉద్యమాలకు దిక్సూచిగా యుటిఎఫ్ పని చేస్తుందని, రాబోయే సంవత్సరంలో ఉపాధ్యాయులు ప్రణాళికా బద్ధంగా ముందుకెళ్లడానికి యూటిఎఫ్ సక్రమైన సమా చారం ఇవ్వాలనికోరారు. ఈ సందర్భంగా యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ హక్కులను కాపాడటంలో యూటిఎఫ్ ముందుంటతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ గోవిందరాజులు, ఎమ్మార్సి సిబ్బంది, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పారా ఒలంపిక్స్‌లో శింగనమల విద్యార్థుల ప్రతిభ

శింగనమల, డిసెంబర్ 29 ప్రభాతవార్త



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఎంఈఓ నరసింహరాజు

జిల్లా కేంద్రంలో ఈ నెల 4వ తేదిన నిర్వహించిన జిల్లా స్థాయిలో నిర్వ హించిన పారా ఒలంపిక్స్‌లో శింగనమల ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు పాల్గొని మొదటి, రెండవ స్థానాలను సాధించి చక్కటి ప్రతిభ కనబ ర్చారని ఎంఈఓ నరసింహరాజు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సిలో మొదటి స్థానం సాధించిన ప్రేమ్‌కుమార్, రెండో స్థానం సాధించిన కృష్ణ ప్రవీణ్‌ను ఐఈఆర్‌పి లోకేష్, ఐఇడిఎస్ఎస్ యశో ధ, రాజేష్, టీచర్లను ప్రోత్సహించి ముందుకు తీసుకెళ్లడాన్ని వారు ప్రశంసించారు.

## టీడీపీ బలోపేతానికి కృషి చేయండి

### - ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, డిసెంబర్ 29 ప్రభాతవార్త



ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి పూల బొకే ఇస్తున్న దృశ్యం

ఇటీవల టిడిపి జిల్లా అధికార ప్రతినిధిగా ఎంపికైన కాయల అనిల్‌కుమార్ యాదవ్ సోమవారం జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి, టీడీపీ సీని యర్ నాయకురాలు బండారు లీలావతిని శింగనమల మార్కెట్ యార్డు చైర్మన్ దండు శ్రీనివాసులుతో కలిసి శాలువాతో సత్కరించిపూల బొకేను అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శింగనమల ఆయకట్టు చైర్మన్ బోయ సత్యనారాయణ, మాజీ జడ్పిటిసి తరిమెల రామకృష్ణ, టిడి పి నాయకులు దాసరి గంగాధర్, బెస్త నారాయణస్వామి, చిన్నజలాలపురం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి జిల్లా అధ్యక్షులు, ఉపాధ్యక్షులను సత్కరించిన దండు

శింగనమల, డిసెంబర్ 29 ప్రభాతవార్త

జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులుగా ఎంపికైన పూల నాగరాజును ఆంధ్రప్రదేశ్ కార్మిక సంక్షేమ సంఘం బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరిని జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం శింగనమల మార్కెట్‌యార్డు చైర్మన్ దండు శ్రీనివాసులు గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమం లో ఆయన వెంట టిడిపి సీనియర్ నాయకులు దాసరి గంగాధర్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రె టరీ బండి పరుశురామ్, శింగనమల ఆయకట్టు చైర్మన్ బోయ సత్యనారాయణ, జిల్లా పార్లమెంట్ అధికార ప్రతినిధి మట్ల గొంది అనిల్, చిన్నజలా లపురం సుధాకర్, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



టిడిపి జిల్లా అధ్యక్షులు, ఉపాధ్యక్షులను గజ మాలతో సన్మానిస్తున్న దృశ్యం

## జనవరి 2 నుంచి కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ

శింగనమల, డిసెంబర్ 29 ప్రభాతవార్త

రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు రీ సర్వే పూర్తి అయిన గ్రామాలలో జనవరి 2 నుంచి 9వ తేది వరకు సంబంధిత గ్రామ సచివాలయాలలో కొత్త పట్టాదారుపాసుపుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు తహశీల్దారు శేషారెడ్డి తెలిపారు. 2వ తేది కర్ణాటకం పల్లి , వెస్ట్ నర్సాపురం సచివాలయం, మధ్యాహ్నం బుడ్డేపల్లి, నాయనివారిపల్లి, రచ్చకట్ట, 3వ తేది ఆకులేడు సచివాలయం, 6వ తేది ఉదయం చెన్నవరం, నాగలగుడ్డం పీర్ల చావిడి, మధ్యాహ్నం నిదనవాడ సచివాలయం, 7వ తేది పెరవలి సచివాలయం, 8వ తేది రాచేపల్లి, గ్రామంలో రచ్చకట్ట, 9వ తేది జులాకాలువ గ్రామంలోని రచ్చకట్ట వద్ద పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## నేడు మిల్లెట్ స్వీట్ హౌస్ ప్రారంభం

అనంతపురం కల్చరల్, డిసెంబర్ 29 ప్రభాతవార్త



సెరా ప్రెసిడెంట్ కుల్లాయిస్వామి

జిల్లాలోని ప్రజలను ఆరోగ్యవంతులుగా చేసేందుకే దయాలి టీస్ ఫ్రీ మిల్లెట్ స్వీట్ హౌస్‌ను ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగ మద్దయ్య చేతుల మీదుగా ప్రారం భించడం జరుగుతుందని సెరా ప్రెసిడెంట్ కుల్లాయిస్వామి పేర్కొ న్నారు. సోమవారం మిల్లెట్ స్వీట్ హౌస్ దుకాణంలో విలేకరుల సమా వేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సెరా ప్రెసిడెంట్ కుల్లాయి స్వామి మాట్లా డుతూ.. ఈత బెల్లంతో తయారు చేసిన స్వీట్స్ తింటే ఆరోగ్యం బాగుం టుందనే ఉద్దేశ్యంతోనే ఈ స్వీట్ హౌస్‌ను ప్రారంభించడం జరుగు తుందని, ఈత బెల్లంతో తయారు చేసిన స్వీట్స్‌ను మధుమోహం ఉన్నవాళ్లు నిర్భయంగా తినవచ్చున్నారు. దీని వల్ల షుగరన వ్యాధి పెరగదని, అంతేకా కుండా ఈ బెల్లం తినడం వల్ల అనేక ఆరోగ్య కరమైన ఉపయోగాలు ఉన్నాయ న్నారు. సెరా సంస్థ 1986 నుండే అనేక గ్రామాలలో గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని, సేవా కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అనంత పురం జిల్లాలో ఈత వనాలు ఎక్కువగా ఉన్నాయని, ఈ ఈత చెట్ల ద్వారా ఆరోగ్యకరమైన పానీయం వస్తుందని, అదేవిధంగా ఈ నీరా ద్వారా బెల్లం కూడా తయారు చేయవచ్చునని తెలియజేశారు. ఈ నీరాను, దీని ద్వారా వచ్చే ఇతర ఉత్పత్తులను తయారు చేయడం మొదలు పెట్టడం జరిగిందని తెలియజేశారు.

## ఆర్టీసీలో పనిచేసే ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : సీఐటీయూ

అనంతపురం, డిసెంబర్ 29 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఏపీఎస్ఆర్టీసీ సంస్థలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, ఆన్ కాల్ డ్రైవర్లు, అద్దె బస్సు డ్రైవర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ నేతలు సోమవారం డిమాండ్ చేశారు. నగరంలోని ఖాజానగర్‌లో ఉన్న మున్సిపల్ యూనియన్ సీఐటీయూ కార్యాలయంలో జిల్లా పరిధిలోని వివిధ ఆర్టీసీ డిపోలలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, ఆన్ కాల్ డ్రైవర్లు, అద్దె బస్సు డ్రైవర్లతో సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఏపీఎస్ఆర్టీసీ (ఏపీపి టీడీ) కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ కామ్రేడ్ డి.అనిల్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సీఐటీ యూ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ నాగేంద్ర, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కామ్రేడ్ గోపాల్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ నాగభూషణం పాల్గొన్నారు. వివిధ విభాగాలలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించి, వాటి పరిష్కారాల కోసం సంబంధిత అధికారులతో చర్చించాలని నిర్ణయించారు. ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న అన్ని కేటగిరీల ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, ఆన్ కాల్ డ్రైవర్లు, అద్దె బస్సు డ్రైవర్లకు లేబర్ సర్కులర్ ప్రకారం వేతనాలు చెల్లించాలి. ప్రతి ఆరు నెలలకు లేబర్ డిపార్ట్మెంట్ జారీ చేసే వేతన సవరణ సర్కులర్లను అన్ని డిపోల నోటీసు బోర్డులపై ప్రదర్శించాలి. ప్రతి ఉద్యోగికి తప్పనిసరిగా ఏపీఎస్ఆర్టీసీ సంస్థ అధికారులే గుర్తింపు కార్డులు జారీ చేయాలి. లేబర్ సర్కులర్ ప్రకారం ప్రతి ఉద్యోగికి వీక్లీ ఆఫ్‌లు కల్పించాలి. ఈ సమా వేశంలో రవి కుమార్, శంకర్, గౌస్ పీరా, బాషా, లోకేష్, నాగేం ద్రతో పాటు వివిధ డిపోలలో పనిచేస్తున్న అనేక మంది ఔట్సో ర్సింగ్ ఉద్యోగులు పాల్గొని తమ సమస్యలను వివరించారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరి ంచకపోతే సీఐటీయూ ఆధ్వర్యం లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

# న్యూ ఇయర్ పేరుతో హద్దులు మీరితే కఠిన చర్యలు తప్పవ్..

## - నూతన సంవత్సర వేడుకల్లో పోలీసు వ్యవస్థ నిబంధనలను పాటించాలి

## - శింగనమల సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కౌలుట్లయ్య

శింగనమల, డిసెంబర్ 29 ప్రభాతవార్త

నూతన సంవత్సర వేడుకలతో ప్రజలకు ఇబ్బందులు కలగజేసే విధంగా వ్యవహరిస్తూ హద్దులు మీరి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని శింగనమల సిఐ కౌలుట్లయ్య తెలిపారు. సోమవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేస్తూ.. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నేటి నుంచి న్యూ ఇయర్ వరకు స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌ను అమలు చేస్తున్నామని న్యూ ఇయర్ అంటూ రోడ్లపైకి వచ్చి మద్యం సేవించడం, ద్విచక్ర వాహనాలు తిప్పడం, మద్యం సేవించి ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, పోలీసు వ్యవస్థ నిబంధనలను ప్రజలు తూచా తప్పకుండా పాటించాలన్నా రు. డిసెంబర్ 31వ తేది సాయంత్రం 4 గంటల నుంచి 1వ తేది ఉదయం 9 గంటల వరకు హోటల్స్, రెస్టారెంట్లు, దాబాలు, మద్యం దుకాణాలు మూసివేయాలన్నారు. మద్యంసేవించి రోడ్లపై వాహనాలతో యువకులు తిరుగుతూ కనిపిస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. శింగనమల సర్కిల్ పరిధిలోని గార్లదిన్నె, నార్పల, శింగనమల మండలాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అల్లర్లకు తావు లేకుండా పటిష్ట బధ్రతను ఏర్పాటు చేశామన్నారు. ఈ విషయాన్ని ప్రజలు, యువకులు, ముఖ్యంగా యువత వారి తల్లిదండ్రులు గమనించి పోలీసు వ్యవస్థ ఇచ్చిన నిబంధనలను ప్రజలందరూ తప్పనిసరిగా పాటించాలన్నారు.



సిఐ కౌలుట్లయ్య

# ఎంపీటీసీల గౌరవ వేతనం తక్షణమే ప్రభుత్వం చెల్లించాలి !

రాప్తాడు, డిసెంబర్ 29 ప్రభాతవార్త

ఎంపిటిసిల గౌరవ వేతనం తక్షణమే చెల్లించాలి అని రాప్తాడు ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి సత్యనారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం

ఎంపీటీసీలతో కలిసి జిల్లా కలెక్టర్ ఆనంద్ కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారులోకి వచ్చినప్పటి నుంచి ప్రజాప్రతినిధులకు గౌరవంతోపాటు వేతనాలు లేకుండా పోయాయి. ఎంపీటీసీ సభ్యునికి నెలకు రూ.3వేలు .ఎంపీపీ కి 6000 చొప్పున గౌరవ వేతనం ఇవ్వాల్సి ఉంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రెండు విడతల్లో ఎంపీటీసీలకు గౌరవ వేతనాలు చెల్లించారు. సార్వత్రిక ఎన్నికల కారణంగా గత ప్రభుత్వం ఎంపీటీసీలకు వేతనాలు చెల్లించలేకపోయింది. జూన్ 30న కొత్తగా కూటమి ప్రభుత్వం కొలువుదీ రింది. అంతకుముందు పెండింగ్లో ఉన్న వేతనాలతో పాటు దాదాపు రెండేళ్లకు పైగా వేతనాలు రావాల్సి ఉంది. కానీ నేటికీ తమకు రావాల్సిన వేతనాలపై దృష్టి సారించడంలేదని ఇది అధికారుల నిర్లక్ష్యమా లేక ప్రభుత్వ లోపమా తెలియడం లేదని పలువురు ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు, ప్రజల చేత ఎన్నికై న ప్రజాప్రతినిధులకు ఏ మాత్రం గౌరవం ఇవ్వకుండా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల్లో టీడీపీ నాయకులకు ఇచ్చిన ప్రాధాన్యత తమకు అధికారులు ఇవ్వడం లేదని వాపోతున్నారు.

**సర్వసభ్య సమావేశాలకే పరిమితం !** కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సర్వసభ్య సమావేశాలకు హాజరుకావడమే తప్ప ప్రజల సమస్యలను పరిష్కరించాలని మండల అధికారుల దృష్టికి తీసు కొచ్చినా పట్టిం చుకున్న పాపాన పోలేదని వాపో తున్నారు. కనీసం ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు సైతం తమను ఆహ్వానించడం లేదని చెబుతు న్నారు. నిధులు మంజూరుపైనా తమకు కనీస సమాచారం ఇవ్వడం లేదంటున్నారు. ఇలా తమను వివక్షతకు గురిచేస్తున్నారని మండిపడుతున్నారు.



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

# రెవెన్యూ క్లీనిక్‌తో భూ సమస్యల పరిష్కారం

కదిరి, డిసెంబర్ 29 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన రెవెన్యూ క్లీనిక్‌లతో భూ సమస్యలు పరిష్కారం అయ్యాయని ఎమ్మెల్యే క ందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం కదిరి రూరల్ మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన రైతులు కొన్ని సంవత్సరాలుగా 22ఎ భూ సమస్యతో రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగి పోయారు. రెవెన్యూ సమస్యలపరిష్కారానికి రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలో కూటమి ప్రభుత్వం సంచలనాత్మక నిర్ణయం తీసుకుని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రతి నాల్గవ శనివారం రెవెన్యూ క్లీనిక్‌లను నిర్వహిస్తోంది. అందులో భాగంగానే కదిరి రూరల్ మండలం బ్రాహ్మణపల్లికి చెందిన రైతులు తమ భూ సమస్యలపై జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లీనిక్‌లో పూర్తి ఆధారాలతో రైతులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి 24 గంటలు గడవక ముందే ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ చొరవతో సమస్య పరిష్కారం అయిం ది. సమస్య పరిష్కారం అయిన వెంటనే జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే కందికుం ట వెంకట ప్రసాద్ చేతుల మీదుగా రైతులకు ఎన్‌ఓసి పత్రాలు అందజేయడంతో ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలను 24 గంటల్లోనే పరిష్కరించిన ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజే యడంతోపాటు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు.



రైతులకు ఎన్ఓసి పత్రాలు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

# ఫ్యాషన్ డిజైన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఫ్యాషన్ టూర్..

అనంతపురం కల్చరల్, డిసెంబర్ 29 ప్రభాతవార్త

ఫ్యాషన్ డిజైన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్ తో సహకారం పై ఆనందంగా ఉందని ఎఫ్ డి సి ఐ చైర్మన్ సునీల్ అన్నారు. ఈ సహకారం ద్వారా ఫ్యాషన్ యొక్క రెండు శక్తివంతమైన దిగ్గజాలను ఏకం చేసి దాని భవిష్యత్తును రూపొందిస్తుందని, ఈ ఎడిషన్ సృజనాత్మకత సంస్కృతులను సంబరం చేసిందన్నారు. భారతదేశపు ఫ్యాషన్ లో రాబోయే ట్రెండ్ కోసం మార్గం ఏర్పాటు చేయడం శుభ పరిణామం అని కొనియాడారు. ప్రధాన ఆకర్షణగా ఇషాన్ కట్టర్ నిలిచారు. డిజైనర్ అనామిక ఖన్నా బ్లెడ్డర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్ తో కలిసి ఆధునిక ప్రపంచం కోసం పనిచేయడం ఎంతో ఉత్సాహంగా ఉందన్నారు.

## ఉపాధ్యాయులపై పర్యవేక్షణలో విద్యాశాఖతో సంబంధంలేని ఇతర శాఖల అధికారులను నియమించడం సరికాదు

### - యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్య దర్సులు కోటేశ్వరప్ప, ఈశ్వరయ్య

అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 29 ప్రభాతవార్త

ఇటీవల రాష్ట్ర విద్యా ఉన్నతా ధికారులచే రూపొందించి న వందరోజుల ప్రణాళిక అనే కార్యక్రమాన్ని విద్యాశాఖ అమలు చేస్తుంది. ఈ కార్యక్రమాన్ని పర్య వేక్షించే పనిని విద్యాశాఖతో సంబంధంలేని ఇతర డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న అధికారులను నియమించడం అభ్యంతరకరమని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కోటేశ్వరప్ప, ప్రధాన కార్య దర్శి ఈశ్వరయ్య ఒక ప్రకటనలో ఖండించారు. కోటేశ్వరప్ప మాట్లాడుతూ రాష్ట్ర విద్య ఉన్నతాధికారులు వంద రోజుల ప్రణాళికను రూపకల్పన చేసి, పదవ తరగతి విద్యార్థుల పబ్లిక్ పరీక్షలలో మెరుగైన ఫలితాలను సాధించాలని సంకల్పించి ఈ ప్రణాళికను అమలు చేయడం సంతోషకర మైనప్పటికీ, సెలవు రోజుల్లో కూడా పనిచేయాలనే నిబంధన పెట్టి, పండుగ సెలవుల్లో మరియు సెలవు రోజులలో కూడా ఈ ప్రణాళికను అమలు చేయమనడం సరికాదన్నారు.

## బదిలీ అయిన ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

నంబులపూలకుంట, డిసెంబర్ 29 ప్రభాతవార్త



బదిలీపై వెళ్లిన మహేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

సుదీర్ఘ కాలం పాటు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మేకల చెరువు నందు పనిచేస్తూ బదిలీపై సింగనమల మండలానికి వెళ్లిన మహేశ్వర్ రెడ్డిని ఎం ఆర్ సి సిబ్బంది ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓలు గోపాల్ నాయక్, సుబ్బిరెడ్డి మాట్లాడుతూ పాఠశాల పిల్లల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసిన ఉపాధ్యాయుడు మహేశ్వర్ రెడ్డి అని, ఉపా ధ్యాయులకు ఏ సమస్య వచ్చినా స్పం దించి సేవలు అందించాడని తెలిపారు. సర్వీస్ మేటర్స్ లో ఎం ఆర్ సి సిబ్బందికి చక్కని సహకారం అందించారని తెలిపారు. ఉత్తమ సేవలందించి న ఉపాధ్యాయుడిని సన్మానిం చడం ఆనందించదగ్గ పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్ రెడ్డి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి, శంకర్ రెడ్డి, శంకర్, శివకుమార్ మరియు ఎమ్మార్సీ సిబ్బంది ఈశ్వర్ రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## భూ రీసర్వేకి రైతులందరూ అధికారులకు సహకరించండి

### - గ్రామసభలో రీసర్వే డిటీ ప్రసాద్ రైతులకు సూచన

కూడేరు, డిసెంబర్ 29 ప్రభాతవార్త



మాట్లాడుతున్న రీ సర్వే డిటి ప్రసాద్

మండలపరిధిలోని గొటుకూరు, కమ్మూరు గ్రామ రెవెన్యూ పంచాయతీల యందు జనవరి రెండవ తేదీ నుండి జరిగే భూముల రీసర్వేలో భాగంగా ప్రతి ఒక్క రైతు సహకరించాలని సోమవారం నిర్వహించిన గ్రామసభలలో రీసర్వే డిటి ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వే జరిగే రోజున ప్రతి ఒక్క రైతు వారి భూమి వద్దకు హాజరై, వారి సరిహద్దులు చూపించవలెనని తెలిపారు. కమ్మూరు రెవెన్యూ పొలం విస్తీర్ణం 8420 ఎకరాలు ఖచ్చితమైన కొలతలు స్పష్టమైన విస్తీర్ణంతో నూతన భూ రికార్డులు తయారు చేయబడతాయని తెలిపారు. ఇకపై సరిహద్దు వివాదాలు తొలగిపోతాయని, భూ యజమానులు వారి పేరు, ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్. రెవెన్యూ రికార్డులలో నమోదు చేసుకోవాలని తెలిపారు. అనంతరం అధికారులు గ్రామ ప్రజలు కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ ఆయేషా సిద్దిఖీ, వీఆర్వోలు కుల్లాయిస్వామి, రామకృష్ణ, గ్రామపంచాయతీ సెక్రటరీ హరినాథ్, గ్రామ సర్వేయర్లు, కమ్మూరు గ్రామ పంచాయితీ సర్పంచ్ చిన్న రంగారెడ్డి, మాజీ జెడ్పిటిసి రామచంద్ర, కమ్మూరు భాష, ఎర్రిస్వామి తెలుగుదేశం పార్టీ నాయకులు కమ్మూరు, అరవకూరు గ్రామప్రజలు పాల్గొన్నారు.

## సభ్యుల గౌరవవేతనాలను వెంటనే విడుదల చేయాలని కలెక్టర్‌కు వినతి

కూడేరు, డిసెంబర్ 29 ప్రభాత వార్త

గత రెండు సంవత్సరాల నుండి రాష్ట్ర ప్రభుత్వం నుండి రావాల్సిన ఎంపిపి, ఎంపీటీసీల గౌరవేతనాలను వెంటనే విడుదల చేయాలని, సోమవారం జరిగిన గ్రీవెన్స్ లో జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ కు వినతి పత్రం అందజేసినట్లు ఎంపీపీల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూడేరు మండల ఎంపీపీ నారాయణ రెడ్డి విలేకరులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు బ్రహ్మసముద్రం ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి తో పాటు పలువురు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఫోటో రైటప్ సిటీ 1.విజయవాడ జట్టుకు ట్రోఫీని అందిస్తున్న ఏడిసిపి కార్యదర్శి యుగంధర్ రెడ్డి. సదరన్ స్ట్రైకర్స్ ,అనంత స్పోర్ట్స్ అకాడమీ జట్లు అనంతపురం సిటీ .ప్రభాత వార్త :డిసెంబర్ 29ఆర్డీటీ క్రీడా మైదానం వేదికగా జరుగుతున్నవిజయవాడమధ్య జరిగిన మ్యాచ్ లో ఏఎస్ఏ ఉమెన్స్ కప్ టోర్నీలో సదరన్ స్ట్రైకర్స్ ,అనంత స్పోర్ట్స్ అకాడమీ జట్లు ఫైనల్ కు చేరాయి. గత 4 రోజులుగా జరుగుతున్న టోర్నీలో సోమవారం జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్ లలో సదరన్ స్ట్రైకర్స్ విజయవాడ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో సదరన్ స్ట్రైకర్స్‌పై 4 వికెట్ల తేడాతో విజయం సాధించి ఫైనల్ కు చేరింది. అదే విధంగా చిత్తూరు అనంత స్పోర్ట్స్ అకాడమీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో అనంత స్పోర్ట్స్ అకాడమీ జట్టు 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి. ఫైనల్ కు చేరింది. 3వ స్థానం కోసం విజయవాడ, చిత్తూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో విజయవాడ జట్టు విజయం సాధించడంతో ఏడిసిపి కార్యదర్శి యుగంధర్ రెడ్డి ట్రోఫీని జట్టు సభ్యులకు అందచేశారు. మంగళవారం జరగనున్న ఫైనల్ మ్యాచ్ లో విజేతలకు కప్ ను అందించేందుకు ఆర్డీటీ ఉమెన్ ఎంపవర్మెంట్ డైరెక్టర్ విశాల ఫెర్రర్, ఇండియా టీమ్ మహిళా జట్టు క్రికెటర్ అనూష, ఇటీవల అంధ మహిళా వరల్డ్ కప్ సాధించిన టీం క్యాప్టెన్ దీపికా లు హాజరుకానున్నారు.

## విబీ44పై రైస్ మిల్లుల ధూళి ముప్పు..

గార్లదిన్నె, డిసెంబరు 29,ప్రభాత వార్త:



మిల్లుల ధూళి ముప్పుపై కలెక్టర్‌కు అర్జీ అందజేస్తున్న రామప్ప నాయక్..

గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామ విబీ44 పక్కనే నడుస్తున్న రైస్ మిల్లుల వల్ల ప్రజలు ఊపిరాడక ఇబ్బందులు పడుతున్నారని జైభీమ్ రావ్ భారత్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు రామప్ప నాయక్ మండిపడ్డారు. మిల్లుల నుంచి ఎగసే పొట్టు ధూళితో హైవేపై ప్రయాణించే వాహనదారులు ధూళి మబ్బుల్లో ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. పర్యావరణ నిబంధనలు, భద్రతా చర్యలు పూర్తిగావిస్మరిం చబడు తున్నాయని ఆరోపిస్తూ, తక్షణమే రైస్ మిల్లులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు..

**CHANGE OF NAME**

I. SHAIK SHAFIULLA (OLD NAME) S/o USMAN SAB KALPI, R/o 17-5-174, HASNABAD, HINDUPUR, 515201 Sri Sathya Sai District Andhra Pradesh, I Changed my name SHAIK SHAFIULLA (OLD NAME) TO KALPI SHAFIULLA (NEW NAME) Henceforth I am be called as KALPI SHAFIULLA for All purposes.

**CHANGE OF NAME**

I. SHAIK SUMAIYA BANU (Old name) W/o SHAFIULLA KALPI, R/o 17-5-174 HASNABAD, HINDUPUR, 515201, Sri Sathya Sai District Andhra pradesh I. Changed my name SHAIK SUMAIYA BANU (Old name) to SUMAYYA BANU (New name) Hence forth I belling called As SUMAYYA BANU for All purposes

**CHANGE OF NAME**

I. BUDAIN SAB NOORULLA (OLD NAME) S/o BUDEN SAB ZIKRIYA SAB R/o 26-4-2524, MELAPURAM, HINDUPUR 515201. Sri Sathya Sai District Andhra pradesh, I Changed my name BUDAIN SAB NOORULLA (OLD NAME) TO BUDEN SAB NOORULLA (NEW NAME) Henceforth Iam be called as BUDEN SAB NOORULLA for All purposes.

04ATP29_04ATP29.qxd 29-12-2025 PM 10:53 Page 1



# విద్యార్థులు ఆందోళన చెంద వద్దు..

## - ప్రభుత్వం అండగా ఉంటుంది - కెజిబివి టైప్-4 హాస్టల్ ఘటనపై ఎమ్మెల్యే తక్షణ స్పందన
## - వీడియో కాల్ ద్వారా భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, డిసెంబర్ 29 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని కెజిబివి టైప్-4 హాస్టల్‌లో విద్యార్థులు సోమవారం ఆందోళనకు దిగారు. తమకు సేవలు అందిస్తున్న ట్యూటర్ వార్డెన్‌ను బదిలీ చేయవద్దని కోరుతూ విద్యార్థులు నిరసన వ్యక్తం చేస్తున్నారని తెలుసుకున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ వెంటనే స్పందించి సంబంధిత అధికారులను సమస్యపై సమగ్రంగా విచారణచేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మండల విద్యాధికారి నరసిం హరాజు హాస్టల్‌కు చేరుకుని పరిస్థితిని పరిశీలించి సమస్యను ఎమ్మె ల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ వీడియో కాల్ ద్వారా విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యను తెలుసుకుని గతంలో జరిగిన కొన్ని తప్పిదాల కారణంగానే సంబంధిత ట్యూటర్, వార్డెన్‌కు బదిలీ జరిగిం దని విద్యార్థులకు స్పష్టంగా వివరించారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని హాస్టల్ ఇన్‌చార్జ్‌గా కెజిబివిఎస్ఓ గీతారాని అందుబాటులో ఉంటారిన ఎమ్మె ల్యే



నిరసనతెలుపుతున్న విద్యార్థినీలు



: లైవ్‌లో వీడియో కాల్‌లో మాట్లాడు తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

వారికి భరోసా ఇచ్చారు. విద్యార్థినీలు చదువుపై దృష్టి పెట్టాలని, ఎటువంటి ఆందోల నకు గురి కావద్దని హితవు పలికారు. విద్యార్థుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తప్పకుండా పరిష్కరిస్తామని, తాము ఎప్పుడు విద్యార్థులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ భరోసాతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

# తెదేపాకు కార్యకర్తలే అధినేతలని ఆచరణాత్మకంగా చూపుదాం

## జిల్లాను టీడీపీకి కంచుకోట చేయడమే లక్ష్యం - తెదేపా జిల్లా అధ్యక్షులు ఎం.ఎస్.రాజు

శ్రీ సత్యసాయి జిల్లా, డిసెంబర్ 29, ప్రభాతవార్త ప్రతినిధి

తెలుగుదేశంపార్టీకి కార్యకర్తలే అధినేతలు అనే విషయాన్ని ఆచరణాత్మకంగా శ్రీ సత్యసాయిజిల్లాలో చేసి చూపించాలనీ మడకశిర శాసన సభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు, శ్రీ సత్యసాయిజిల్లా తెలుగు దేశంపార్టీ అధ్యక్షులు ఎం.ఎస్.రాజు పిలుపునిచ్చారు. సోమవారం హిందూ పురం పార్లమెంటు కమిటీ సభ్యులతో పుట్టపర్తిలోని సాయి సదన్ మేడ గెస్ట్ హౌస్ లో హిందూపురం పార్లమెంటు కమిటీ సభ్యులతో ఆత్మీయ పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.ఎస్. రాజు మాట్లా డుతూ శ్రీ సత్యసాయి జిల్లాలో తెలుగుదేశంపార్టీని బలోపేతం చేసేందు కు కమిటీ సభ్యులంతా తమవంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. పార్టీ అధిష్టానం మనమీద పెట్టుకున్న నమ్మకాన్ని నూటికి నూరుశాతం నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందనీ, వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎన్నో కష్టాలు, నిందలు, అవమానాలు ఎదుర్కొన్నటువంటి టీడీపీ కార్యకర్తలకు అం దరం అండగా నిలవాలన్నారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా పార్టీ అండగా నిలబడుతుందనే నమ్మకాన్ని కలిగించాలన్నారు. ఒక స్నేహపూర్వక వాతా వరణాన్ని సృష్టించి, అధికారులు, ప్రజలకు మధ్య నాయకులు సమన్వయ కర్తలు గా ఉండాలన్నారు. జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను జోడెద్దుల బండిలా వేగంగా ముం దుకు నడిపించేందుకు కష్టప డాలన్నారు. శ్రీ సత్య సాయి జి ల్లాను రాష్ట్రంలోనే అన్ని విధా లా ముందు వరుసలో నిలబెట్టేందుకు కమిటీ సభ్య లు, నాయకులు కష్టపడి పనిచే యాల్సిన అవసరం ఉందన్నా రు. పార్టీకి చెడ్డపేరు వచ్చే విధం గా ఎవరూ వ్యవహరిం చకుండా



ఎం. ఎస్.రాజుకు భగవాన్ సత్యసాయి బాబా చిత్రపటాన్ని అందిస్తున్న దృశ్యం

జాగ్రత్తగా ఉండాలని, పార్టీ అధి నాయకుడికి అన్ని విధాలా శ్రీ సత్యసాయి జిల్లా భవిష్యత్తులో నిలబడు తుంది అనే నమ్మకాన్ని కల్పించాలన్నారు. ఇందులో ఆయనతో పాటు పార్టీ అబ్జర్వర్ సామకోటి ఆదినారాయణ ఉన్నారు. పార్టీని గ్రామ, మండలం, జిల్లా స్థాయిలో బలో పేతం చేసుకుంటూ పనిచేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా టీడీపీ ప్రధానకార్యదర్శి హనుమప్ప, నూతనంగా నియమి ంచబడిన హిందూపురం పార్లమెంటు టీడీపీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# గార్మెంట్స్ పరిశ్రమల్లో మహిళలకు మంచి ఉపాధి అవకాశాలు

## - మహిళలకు అవగాహన కార్యక్రమంలో సెర్ప్ స్టేట్ డైరెక్టర్ పద్మావతి

ఉరవకొండ, డిసెంబరు 29 ప్రభాతవార్త

గారె ్మంట్స్ పరిశ్రమల్లో మహిళలకు మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని సెర్ప్ స్టేట్ డైరెక్టర్ పద్మావతి అన్నారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో సోమవారం గార్మెంట్స్ పరిశ్రమపై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ గార్మెంట్స్ పరిశ్రమల్లో మహిళలు ఎక్కువ మందికి ఉపాధి కల్పించడానికి అవస రమైన కార్యచరణ రూపొదిం చడం జరుగుతోందన్నారు. మరో 6 నెలల కాలంలో ఉరవకొండలో గారె ్మంట్స్ పరి శ్రమ ఏర్పాటు కాబోతోందని అన్నారు. ఈ సం దర్బంగా వివిధ మండలాల నుండి తరలివచ్చిన టైలరింగ్‌లో అనుభవం కల్గిన మహిళలు తయారు చేసిన వివిధ వస్త్రాలను పరిశీలించి వారి ఆలోచనలను, వారు మరింత అభివృద్ధి చెందడానికి ఎలాంటి ప్రోత్సాహం అవసరం అన్న అంశాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శైలజ, హ్యాండ్ లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ ఏడీ వరప్రసాద్, స్థానిక ఏపీఎం శివయ్య తదితరులు పాల్గొన్నారు.



మహిళలు తయారు చేసిన వస్త్రా లను పరిశీలిస్తున్న సెర్ప్ స్టేట్ డైరెక్టర్ పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ శైలజ తదితరులు



హాజరైన మహిళలు

# వైకుంఠ ఏకాదశికి ముస్తాబైన చింతలరాయుని ఆలయం

తాడిపత్రిఅర్బన్, డిసెంబర్ 29 ప్రభాతవార్త

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పురాతన ఆలయమైన శ్రీచింతల వేంకటరమణస్వామి ఆలయం ముస్తాబైంది. వేలూరు నుండి వచ్చిన వారు దాదాపు 8 లక్షల రూపాయలతో వివిధ రకాల విద్యుత్ దీపాలతో ఆలయంతో పాటు ఆలయ పరిసరాలను సర్వాంగసుందరంగా అలంకరించారు. సామా న్య భక్తులకు పెద్దపీట వేస్తున్నట్లు వైకుంఠ ఏకాదశి నిర్వహణ కమిటీ సభ్య లు పేర్కొన్నారు. పట్టణ సిఐ ఆరోహనరావు ఆలయానికి చేరుకుని బందోబస్తు ఏర్పాట్లపై వైకుంఠ ఏకాదశి నిర్వహణ కమిటీ సభ్యులు దామోద౯ర్‌దాస్, పరిశె చంద్రశేఖర్‌తో చర్చిం చారు. వేకువజాము నుండే దర్శనాలు ప్రారంభం అవుతా యని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు సిఐకి వివరించారు. దాదాపు 25 వేల నుండి 30 వేల మంది భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకో నున్నట్లు అంచనా వేస్తున్నారు. వైకుంఠ ఏకాధశిని పురస్కరించుకుని ఆలయ కమిటీ వారు వెయ్యి రూపాయలు విరాళం ఇచ్చిన వారికి వంద రూపాయల టికెట్, 2 వేలు విరాళంగా ఇచ్చిన వారికి 2 దర్శనం టికెట్లు, 5 వేలు విరాళం ఇచ్చి న వారికి రెండు దర్శనం టికెట్లతో పాటు తిరుమల లడ్డును ఉచితంగా ఇస్తా మన్న ప్రకటనకు భారీ స్పందన వచ్చిందని ఎక్కువ విరాళాలు భక్తులు ఇచ్చారని నిర్వహణ కమిటీ సభ్యులు శేషఫణి తెలిపారు. బెంగుళూరు నుండి ప్రత్యేకం గా తెప్పించిన పలు రకాల పుష్పాలతో ఆలయాన్ని ముస్తాబు చేశారు.



ఆలయంలో పూలమాలలు ఏర్పాటు చేసిన దృశ్యం



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కమిటీ సభ్యులు

# వైకుంఠ ఏకాదశి భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ పి.జగదీష్

అనంతపురం కలెక్టరేట్ డిసెంబర్ 29 ప్రభాతవార్త

అనంతపురం పాతవూరులోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానాన్ని సందర్శించి ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ పి జగదీష్ పరిశీలించారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున జిల్లా ఎస్పీ పి. జగదీష్ సోమవారం అనంతపురం నగరంలోని పురాతన శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానాన్ని సందర్శించి, అక్కడ ఏర్పాటు చేసిన భద్రతా మరియు బందోబస్తు ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆలయ పరిసరాల్లో పోలీసు బందోబ స్తు, ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల రాకపోకల సౌకర్యాలు, సీసీటీవీ పర్యవేక్షణ, ఎమర్జెన్సీ స్పందన ఏర్పాట్లను సమీక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, శాంతియుతంగా వైకుంఠ ఏకాదశి వేడుకలునిర్వహించేందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే, మహిళలు, వృద్ధులు, దివ్యాంగ భక్తులకు ప్రత్యేక సౌక ర్యాలు కల్పించడంతో పాటు, ఆలయ పరిసరాల్లో విజిబుల్ పోలీసింగ్ పెంచాలని, పిక్‌పాకెటింగ్ వంటి నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైకుంఠ ఏకాదశి సంద ర్భం గా జిల్లా వ్యాప్తంగా భద్రతా ఏర్పాట్లు కట్టు దిట్టంగా చేపట్టామని, ప్రజలు పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఈ సందర్భంగా కోరారు. జిల్లా ఎస్పీతో పాటు అనం తపురం ఆర్డీఓ కేశవనాయుడు, అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాస రావు, ఒన్ టౌన్ సి.ఐ వెంకటేశ్వర్లు మరియు దేవాదాయశాఖ అధికారులు, తదితరులు వెళ్లారు.



భద్రత ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ పి, జగదీష్

# పి జి ఆర్ స్ కు వచ్చే ప్రతీ పిటీషన్ ను విచ్చారించి చట్ట పరిధిలో పరిష్కారం చూపండి

## - జిల్లా ఎస్పీ పి.జగదీష్

అనంతపురం కలెక్టరేట్ డిసెంబర్ 29 ప్రభాతవార్త

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజల నుండి 70 ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ పి, జగదీష్. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ప్రతీ పిటీషన్ ను చట్ట పరిధిలో విచారించి పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను త్వరితగతిన నాణ్యతగా పరిష్కారం చూపాలనే రాష్ట్ర ప్రభుత్వం సంకల్పం మేరకు జిల్లా ఎస్పీ సోమవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలమూలల నుండి వచ్చిన ప్రజల నుండి ఎస్పీ 70 ఫిర్యాదులు స్వీకరించారు. పిటీషనర్లతో ముఖాముఖి మాట్లాడారు. సమస్యలను విని అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భార్యాభర్తల గొడవలు, కుటుంబ సమస్యలు, రస్తా వివాదాలు, తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి. ఈకార్యక్రమంలో అశ్విని మణిదీప్, అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.




ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ పి జగదీష్

# ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

## - సిఎం చంద్రబాబుకు మహిళలు రుణపడి ఉండాలి
## - పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

అమడగూరు, డిసెంబర్ 29 ప్రభాతవార్త

అమడగూరు మండల కేంద్రంలోని శ్రీచౌడేశ్వరి కళ్యాణమండపంలో సోమవారం పట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మహిళలు అందరూ రుణపడి ఉండాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను హరితాంధ్రప్రదేశ్‌గా అభివృద్ధి బాటలో ముఖ్యమంత్రి నడిపిస్తున్నారన్నారు. దాదాపు 200 మంది మహిళలకు ఇండియన్ గ్యాస్ ఆధ్వర్యంలో ఒక గ్యాస్ సిలిండర్, స్టవ్, రెగ్యులేటర్, పైపు మహిళలకు అందజేయడం జరిగింది. కట్టెలపొయ్యి వాడకం వల్ల అనేక రకాల వ్యాధులు వస్తున్నాయని గమనించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉజ్వల ఉచిత గ్యాస్ పథకంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని మహిళలను ప్రత్యేకంగా గుర్తుంచుకొని ప్రతి ఇంటికి దీపం కనెక్షన్లు కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. కేవలం 250 రూపాయలకు గ్యాస్ సిలిండర్ సంక్షేమ పథకాన్ని పెట్టారని ప్రస్తుతం ఇప్పుడు ప్రతి ఇంటికి రెండు లేదా మూడు దీపం కనెక్షన్లు ఉన్నాయని ఇలాంటి సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రిని చిరస్థాయిగా గుర్తుపెట్టుకోవాలన్నారు. అంతేకాకుండా ప్రతి ఇంటికి తల్లికి వందనం పథకంలో భాగంగా పిల్లలు ఎంతమంది ఉంటే అందరికీ వారి ఖాతాలో మొత్తాన్ని జమ చేయడం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుపేద కుటుంబాలకు పక్కా ఇల్లు నిర్మాణం ఇలాంటివి ఎన్నో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారన్నారు. ఆమడగూరు మండలాన్ని ప్రత్యేకంగా దృష్టిలో పెట్టుకొని మండల అభివృద్ధికి మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ప్రత్యేక చొరవచూపుతున్నారన్నారు. ఇందులో భాగంగానే ప్రభుత్వ సహకారంలో మండలంలో రోడ్లు, పొలాలకు వెళ్లే వాటికి 56.75 లక్షల ఎన్ఆర్‌జిఎస్ నిధులు మంజూరు అయ్యాయన్నారు. రాబోయే రోజుల్లో మండలాన్ని మరింత అభివృద్ధి పరుస్తామని ఆమె తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ గోపాల్‌రెడ్డి, ఎంపిడిఒ ముని యప్ప, ఇఒఆర్‌డి రాజశేఖర్, మద్దిలేటి, మాజీ జెడ్‌పిటిసి శ్రీనివాస్‌రెడ్డి, ఒడిసి కన్వీనర్ జయచంద్ర, కొత్తచెరువు కన్వీనర్ ఒలిపి శ్రీనివాసులు, ఎల్‌పి జి డీలర్ అసోసియేషన్స్ ప్రెసిడెంట్ రాజీవ్, సీనియర్ నాయకులు దేవర శ్యాంబాబునాయుడు, ఈశ్వర్‌రెడ్డి, రాజారెడ్డి, గోవిందనాయుడు, బిజెపి నాయకులు రాష్ట్ర ఆర్గానిక్ కన్వీనర్ శరత్‌కుమార్‌రెడ్డి, మేకల శ్రీనివాసులు, మహిళా అధ్యక్షురాలు కరే గాయత్రి, బిజెపి అధ్యక్షులు వేమనారాయణ, వడ్డెర్ల సంఘం గౌరవ అధ్యక్షులు వల్లిపి అమర్నాథ్, అధ్యక్షులు పిఆర్‌పి రమణ, వలిపి కిష్టప్ప, టైలర్ జయరామ్, జిల్లా ఉపాధ్యక్షులు తిరుపాల్, కో కన్వీనర్ ఇడగుట్ట రామప్ప, నాగేందర్‌రెడ్డి, రాజు, భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బండి శంకర్, మండల ఎన్ఆర్‌జిఎస్ సిబ్బంది, వెలుగు సిబ్బంది, సచివాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, స్టోర్ డీలర్లు, కూటమి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.





# ఉత్తర ద్వార దర్శనానికి వచ్చే భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పిస్తాం

## - భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు
## - ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

కదిరి, డిసెంబర్ 29 ప్రభాతవార్త

ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రముఖ ప్రసిద్ది గాంచిన లక్ష్మినరసింహస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి వచ్చే భక్తులందరికీ స్వామివారి దర్శన భాగ్యం కల్పిస్తామని ఎమ్మెల్యే కందికుంట వెంటక ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ఆలయంలో ఆర్డిఓ, డిఎస్పీ, ఆలయ అధికారులు ఆలయ ప్రధాన అర్చకులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ముక్కోటి ఏకాదశిపై వచ్చే భక్తులకు తీసుకోవాల్సిన చర్యలు క్యూ లైన్ల ఏర్పాటుపై ప్రధానంగా చర్చించారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేయు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేకంగా మున్సిపల్ అధికారులు ఆలయ తిరువీధుల్లో అపరిశుభ్రత లేకుండా చర్యలు తీసుకోవడం తోపాటు నిత్యం శానిటైజేషన్ చేయాలని సూచించారు. అనంతరం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయంలో చేపట్టిన అలం కరణను పరిశీలించారు. ఈ కా ర్యక్రమంలో ఆర్డిఓ వివిఎస్ శర్మ, డిఎస్పీ శివనారాయణ స్వామి, ఆలయ ఈఓ శ్రీనివా సరెడ్డి, ప్రధాన అర్చకులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లపై అధికారులు, ప్రధాన అర్చకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

# నేడు ఏఎస్ఏ ఉమెన్స్ కప్ ఫైనల్ మ్యాచ్

## ఫైనల్ కు చేరిన సదరన్ స్టైకర్స్ ,అనంత స్పోర్ట్స్ అకాడమీ జట్లు

అనంతపురం సిటీ. :డిసెంబర్ 29 ప్రభాతవార్త :

ఆర్డీటీ క్రీడా మైదానం వేదికగా జరుగుతున్న ఏఎస్ఏ ఉమెన్స్ కప్ క్రికెట్ టొర్నీ ఫైనల్ మ్యాచ్ మంగళవారం జరగనుంది. సోమవారం జరిగిన సెమిఫైనల్ మ్యాచ్ లో సదరన్ స్ట్రైకర్స్ ,అనంత స్పోర్ట్స్ అకాడమీ జట్లు ఫైనల్ కు చేరాయి. గత 4 రోజులుగా జరుగుతున్న టోర్నీలో సోమవారం జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్ లలో సదరన్ స్ట్రైకర్స్ విజయవాడ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో సదరన్ స్ట్రైకర్స్‌పై 4 వికెట్ల తేడాతో విజయం సాధించి ఫైనల్ కు చేరింది. అదే విధంగా చిత్తూరు అనంత స్పోర్ట్స్ అకాడమీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో అనంత స్పోర్ట్స్ అకాడమీ జట్టు 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి. ఫైనల్ కు చేరింది. 3వ స్థానం కోసం విజయవాడ, చిత్తూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో విజయవాడ జట్టు విజయం సాధించడంతో ఏడిసిఏ కార్యదర్శి యుగం ధర్ రెడ్డి ట్రోఫీని జట్టు సభ్యులకు అందచేశారు. మంగళవారం జరగనున్న ఫైనల్ మ్యాచ్ లో విజేతలకు కప్ ను అందించేందుకు ఆర్డీటీ ఉమెన్ ఎంపర్వర్మెంట్ డైరెక్టర్ విశాల ఫెర్రర్, ఇండియా టీమ్ మహిళా జట్టు క్రికెటర్ అనూష, ఇటీవల అంధ మహిళా వరల్డ్ కప్ సాధించిన టీం క్యాప్టెన్ దీపికా లు హాజరు కానున్నారు.




విజయవాడ జట్టుకు ట్రోఫీని అందిస్తున్న ఏడిసిఏ కార్యదర్శి యుగంధర్ రెడ్డి.

# పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారం నాణ్యతగా ఉండాలి : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

అనంతపురం కలెక్టరేట్ డిసెంబర్ 29 ప్రభాతవార్త

అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కా ర వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తో పాటు అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, రామ్మోహన్, మల్లికార్జున, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వ రమ్మ, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 467 అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారం నాణ్యతగా ఉండాలని అయా శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. గడువు ముగిసేలోగా అర్జీలను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎలాంటి పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు అర్జీలను పరిష్కరించాలని, ఇందులో ఎలాంటి అలసత్వం ఉండరాద న్నారు. క్షేత్రస్థాయి అధికారులతో నిత్యం మానిటర్ చేసుకుంటూ అర్జీలను సకాలంలో పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్ ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏలను శ్రద్ధ పెట్టి పరిష్కరించేలా చూడాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. సోషల్ ఫారెస్ట్రీ ఆధ్వర్యంలో మిషన్ హరితాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది 10 లక్షల మొక్కలను నాటడం జరిగిందని, నాటిన మొక్కలకు సంబంధి ంచి ఏపీ ఫారెస్ట్రీ శాఖ అభివృద్ధి చేసిన మిషన్ హరితాంధ్రప్రదేశ్ యాప్ డాష్ బోర్డులో అప్లోడ్ చేయాలని, ఇప్పటి వరకు 6 లక్షల మొక్కలను అప్డేట్ చేయడం జరిగిందని డాష్ బోర్డులో కనిపిస్తో ందని రెవెన్యూ, డ్వా మా, తదితర శాఖల అధికారులు అందరూ పెండింగ్ ఉన్న అప్లోడ్ ని పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, జిల్లా సైనిక్ సంక్షేమ అధికారి తిమ్మప్ప, హౌసింగ్ పిడి శైలజ, సిపిఓ అశోక్ కుమార్, జెడ్పి సిఈఓ శివశం కర్, డిపిఓ నాగరాజునాయుడు, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ సురేష్, ఎపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, ఎల్డిఎం నరేష్ రెడ్డి, డిఎండబ్ల్యుఓ రామసుబ్బారెడ్డి, డిసిఓ అరుణకుమారి, డిఎంహెచ్ఓ డా. ఈబి.దేవి, బిసి వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, ఏడిసిసి బ్యాంక్ సీఈవో సురేఖ రాణి, డిటిసి వీర్రాజు, డ్వామా పిడి సలీమ్ భాష, పంచాయతీరాజ్ ఎస్ఈ సుబ్బరాయుడు, డీఈవో ప్రసాద్ బాబు, డివిఈవో వెంకటరమణ నాయక్, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి అర్చన, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు రియాజుద్దీన్, వసంతలత, యుగేశ్వరిదేవి, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

# ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని మర్యాదపూర్వకంగా కలిసిన గుత్తా భాస్కర్‌నాయుడు

పుట్లూరు, డిసెంబర్ 29 ప్రభాతవార్త

హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ స్టేట్ కన్వీనర్ గుత్తా భాస్కర్‌నాయుడు శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని మర్యాదపూర్వకంగా కలిశారు. గుత్తా భాస్కర్‌నాయుడు గతంలో హెచ్‌ఆర్‌ఏజేలో అనంతపురం జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా ఉండేవారు.

ప్రస్తుతం ఆయన చేస్తున్న టువంటి అనేక సమస్యల పరిష్కారాలు గుర్తించి హెచ్‌ఆర్‌ఏజే జాతీయ అధ్యక్షులు నందం నరసింహారావు, స్టేట్ మహిళా అధ్యక్షురాలు కాకర్ల సరస్వతి ఆయనను స్టేట్ కన్వీనర్‌గా నియమించడం జరిగింది. శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మాట్లాడుతూ హ్యూమన్ రైట్స్ అనేది ప్రతి ఒక్కరి హక్కు దాన్ని ప్రజలకు మంచి చేసే విధంగా ఉపయోగించు కోవాలన్నారు. సామాన్య స్థాయి నుండి స్టేట్ కన్వీనర్‌గా ఎన్నిక కావడం అభినందనీయమన్నారు. అనంతరం గుత్తా భాస్కర్ నాయుడును ఎమ్మెల్యే శాలువాతో సన్మానించి అభినందిం చారు. హెచ్‌ఆర్ ఏజే వారు ఇచ్చిన ఈ అవకాశాన్ని ప్రజలకు మేలు చేయడానికి పనిచేస్తానని గుత్తా భాస్కర్‌నా యుడు పేర్కొన్నారు.



గుత్తా భాస్కర్‌నాయుడును సన్మానిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

# న్యూ ఇయర్ వేడుకల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ ఉపేక్షించేది లేదు

## - ఏఎస్‌పి రోహిత్‌కుమార్‌చౌదరి

తాడిపత్రిటౌన్, డిసెంబర్ 29 ప్రభాతవార్త

న్యూ ఇయర్ వేడుకలపై పోలీసులు ఆంక్షలు విధించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్, డ్రగ్స్ వంటి వాటిని ఉపేక్షించేది లేదని తాడిపత్రి ఏఎస్‌పి రోహిత్‌కుమార్‌చౌదరి హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. డిసెంబర్ 31 రాత్రి జరిగే న్యూ ఇయర్ వేడుకల్లో డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్, డ్రగ్స్ వంటి వాటిని ఉపేక్షించేది లేదన్నారు. అలాగే ద్విచక్ర వాహనంపై వెళ్లే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని, ట్రిపుల్ రైడింగ్ నిషేధమని తెలిపారు. అలాగే ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ద్విచక్ర వాహనాల సైలెన్సర్లు తీయడం, అధిక శబ్ద కాలుష్యంతో సమస్య సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.




ఏఎస్‌పి రోహిత్ కుమార్ చౌదరి